Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.

RNI No.52722/90 సంపుటి : 32 సంచిక : 209 విశాఖపట్నం, 01 జూన్ 2023 గురువారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## ఘనంగా జేయన్‌టీయుకే స్నాతకోత్సవం



కాకినాడ, (విశాఖ సమాచారమ్): ప్రపంచం మెచ్చిన ఎంతోమంది ఇంజనీర్లను, శాస్త్రవేత్తలను అందించిన ఘనత కాకినాడ జేఎన్టీయూకేదని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కొనియాడారు. బుధవారం నాడు జేఎన్టీయూకే తొమ్మిదవ స్నాతకోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేశారు. 1946 జూలై 16న ఏర్పడిన జేఎన్టీయూకే అంచెలంచెలుగా ఎదుగుతూ 14 సంవత్సరాల కిందట ఒక విశ్వవిద్యాలయంగా ఏర్పడడం దేశానికే గర్వకారణం అని అన్నారు. 75 సంవత్సరాల క్రితం ప్రారంభించబడిన జేఎన్టీయూకే పద్మ విభూషణ్ మెట్రో మాన్ డాక్టర్ ఈ. శ్రీధరన్ ,పద్మభూషణ్ ఎన్ సత్య, టెక్సాస్ యూనివర్సిటీ సీఈవో బి వి ఆర్ మోహన్ రెడ్డి వంటి ప్రముఖులను తయారు చేసిన ఘనత జె ఎన్ టీయూకే కె దక్కుతుందని గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. ఈ సందర్భంగా అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ, ఈ (మిగతా 2లో)

## కరీంనగర్‌లో శ్రీవారి ఆలయానికి శంకుస్థాపన

కరీంనగర్: కరీంనగర్‌లో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీవారి ఆలయానికి బుధవారం శంకుస్థాపన జరిగింది. మంత్రి గంగుల కమలాకర్, టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాగా, ఆలయ శంకుస్థాపన సందర్భంగా టీటీడీ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచన, అగ్ని ప్రణయం, కుంభారాధన, విశేష హెూమాలు, శంఖువుకు, అభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రాలతో శ్రీవారి ఆలయానికి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. టీటీడీ ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శ్రీవారి ఆలయం కరీంనగర్‌లో కొలువుదీరడం మా అదృష్టం అన్నారు. ఆలయానికి 10 ఎకరాల భూమి మంజూరు చేసిన తెలంగాణా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు. మా విజ్ఞప్తిని మన్నించి టీటీడీ ఆలయం, 20కోట్లు మంజూరు చేసిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు. ఆలయ నిర్మాణంలో పాలుపంచుకోవడం మాకు దొరికిన అదృష్టం అని తెలిపారు.



అనంతరం, టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ తిరుమలలో మాదిరిగానే కరీంనగర్‌లోనూ సర్వ కైంకర్యాలు జరుగుతాయి అన్నారు. టీటీడీ తరపున అర్చకులు, సిబ్బంది, ప్రసాదంతో పాలు తదితరాలు ఉంటాయన్నారు. కరీంనగర్, తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ పోటు ద్వారా ప్రసాదాలను సైతం ఇక్కడే తయారు చేస్తామని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

## సుబంసిరి జలవిద్యుత్ ప్రాజెక్టుపై కేంద్రమంత్రి సమీక్ష

విజయవాడ, (పీఐబీ): ఎన్‌హెచ్‌పిసి అమలు చేస్తున్న అరుణాచల్ ప్రదేశ్/ అస్సాంలో ఉన్న సుబన్‌సిరి దిగువ జల విద్యుత్ ప్రాజెక్టు (2000 మెగావాట్లు) పురోగతిని సమీక్షించేందుకు కేంద్ర విద్యుత్, నూతన & పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ఆర్.కె. సింగ్ న్యూఢిల్లీలో సమావేశాన్ని నిర్వహించారు.

నిర్మాణ పురోగతి, ప్రాజెక్టుకు సంబంధించిన భద్రతా అంశాలు, రానున్న వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అవసరమైన సంసిద్ధతపై విద్యుత్ మంత్రి సమీక్షించారు.

వివిధ ప్యాకేజీలలో సాధించిన పురోగతి వర్తమాన స్థితిని, భద్రత పరగణనల వివరాలతో పాటు, వానాకాల నెలల దృష్ట్యా నిర్దేశించిన సాంకేతిక ప్రమాణాల ప్రకారం దాని సంసిద్ధతను ప్రాజెక్టు అధిపతి వివరించారు.

డ్యామ్ ను బలపరచడంలో (14 బ్లాకులు ఎగువస్థాయి 210 మీటర్లను, మిగిలిన రెండు బ్లాకులను జూన్ 2023నాటికి పూర్తి) ప్రాజెక్టు గణనీయమైన పురోగతిని సాధించింది. దీనితో పాటుగా, గత ఆరు నెలల కాలంలో 2.5 లక్షల క్యూబిక్ మీటర్ల కంటే ఎక్కువ కాంక్రీట్‌ను పోయడంతో డ్యామ్ ఎత్తును 37 మీటర్లు పెంచడమన్నది (మిగతా 2లో)

## మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై జిల్లాస్థాయి సమీక్ష



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): కాలేజీలు, హాస్టల్స్ , హెూటల్స్ నందు అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, విద్యార్థులు మత్తు పదార్థాల వాడకాన్ని పూర్తిగా కట్టడి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టర్ తన ఛాంబర్ లో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రాఫిక్ సబ్‌స్టెన్సెస్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మత్తుపదార్థాల వినియోగానికి గల కారణాలను విశ్లేషించి కట్టడి చేయాలని పోలీస్, ఎస్ ఈ బి అధికారులను ఆదేశించారు. కాలేజీలు, హాస్టల్స్ , హెూటల్స్ నందు ఎక్కడికక్కడ ప్రత్యేక తనిఖీలను నిర్వహించి కట్టడి చేయాలని అన్నారు. అన్ని కాలేజీల యాజమాన్యాలు తరచుగా తమ కాలేజీ ఆవరణలో (మిగతా 2లో)

## నేటి నుండి శంకర్ ఫౌండేషన్ ఉచిత సేవలు

### సీనియర్ సిటిజన్లు, తెల్ల రేషన్ కార్డ్ హెూల్డర్లకు ఉచిత వైద్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉష ఆత్మకూరి, రష్మీ రత్, కే.బంగార్రాజు

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): మద్దిలపాలెంలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సామాజిక సేవలో భాగంగా ఈ నెల జూన్ 1 నుండి 30 వరకు సీనియర్ సిటిజన్లు, తెల్ల రేషన్ కార్డ్ హెూల్డర్లకు ( బిపిఎల్ కుటుంబాలు) ఉచిత కన్సల్టేషన్ వైద్య సేవలు అందిస్తున్నట్లు శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఇంచార్జ్ ఉష ఆత్మకూరి తెలియజేశారు. బుధవారం ఆస్పత్రి సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉచిత కన్సల్టేషన్ సేవలు అందించడంతోపాటు,దీనికి అదనంగా, ఆసుపత్రిలో ఫార్మసీపై 10 శాతం తగ్గింపు, మరియు ఆప్టికల్స్పై 15 శాతం తగ్గింపు,కంటిశుక్లం శస్త్రచికిత్సల యొక్క వివిధ ప్యాకేజీల పై 10 శాతం తగ్గింపు అందిస్తున్నట్లు తెలిపారు. కంటి రోగులకు సరసమైన ధరలో అత్యుత్తమ నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ అందించడం, నగర ప్రజల నాణ్యమైన కంటి సంరక్షణ వైద్య సేవల కోసం పెరుగుతున్న డిమాండ్ తీర్చడం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య సౌకర్యాలను విశాఖ జిల్లా ప్రజలు పూర్తిగా ఉపయోగించుకోవాలని కోరారు. అంధత్వాన్ని నివారించడానికి, ముందస్తుగా కంటి వ్యాధులను గుర్తించడానికి క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. మద్దిలపాలెం దరి పిఠాపురం కాలనీలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఎన్ఎబిహెచ్ గుర్తింపు పొంది, ప్రముఖ కమ్యూనిటీ ఐ కేర్ సర్వీస్ ప్రొవైడర్ 25 పడకల ఆసుపత్రిగా రోగులకు వివిధ రకాల నాణ్యమైన అత్యుత్తమ సేవలను అందిస్తుందన్నారు. ఆస్పత్రి లో ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్( టీపిఐ), సిజిహెచ్ఎస్ మొదలైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కంటి శుక్లాం, రెటీనా ఆపరేషన్లు సహా అన్ని సౌకర్యాలు, ఆధునిక కంటి వైద్య పరికరాలు, మంచి పరిశుభ్రత, రెండు అల్ట్రా మోడ్రన్ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లను కలిగి ఉందన్నారు. ఆసుపత్రి సీనియర్ నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ రష్మీ రత్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, సిజిహెచ్ఎస్, టిపిఐ, తదితర కార్డులు కలిగిన కంటి రోగులకు చికిత్స అందించేందుకు ఆప్తమాలజి, గక్లోమా, రెటీనా, పిడియాట్రిక్స్, ఆర్బిట్ తదితర అన్ని రోగ నిర్ధారణ సౌకర్యాలు ఈ ఆసుపత్రిలో ఉన్నాయని తెలిపారు.

ఈ సమావేశంలో ఆసుపత్రి పిఆర్, లైసెన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కే బంగార్రాజు పాల్గొన్నారు.

## సింహగిరిపై విశేష ఆర్జిత సేవలు



సింహాచలం, (విశాఖ సమాచారమ్): దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహాలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం పలు ఆర్జిత సేవలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సింహాద్రినాథుడి నిత్యకళ్యాణము తదితర సేవలకు భక్తులు పెద్ద మొత్తంలో హాజరయ్యారు. నిత్య కళ్యాణం లో భాగంగా తొలుత సింహాద్రినాధుడు, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన గావించారు. అనంతరం గంగధార నుంచి తీసుకువచ్చిన పవిత్ర జలాలతో అభిషేకం జరిపారు. తదుపరి స్వామి, అమ్మవార్లను సర్వాభరణాలతో అందంగా అలంకరించారు. వేద మంత్రోశ్చరణలు, మృదుమధుర మంగళవాయిద్యాల నడుమ ఆలయ ఆస్థాన కళ్యాణ మండపంలో అందంగా తీర్చిదిద్దిన కళ్యాణ వేదికపై స్వామి, అమ్మవార్లను ఆసీనులను చేశారు. విశ్వక్సేన, పుణ్యాహవచనం, ఆరాధన, కంకణదారణ,నూతన యజ్ఞోపవీతం, జిలకర్రబెల్లం తలంబ్రాల ప్రక్రియలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిత్య కళ్యాణంలో అప్పన్న ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబుతో పాటు పలువురు భక్తులు స్వామిని దర్శించుకొని సేవించుకున్నారు. ఆలయ ఏఇఓ వై.శ్రీనివాసరావు, తదితరులంతా పాల్గొని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## ఆనందపురం కూడలిలో... నిత్యం అష్టకష్టాలే..



ఆనందపురం, ఆనందపురం కూడలిలో 16వ జాతీయ రహదారి పైవంతెన నిర్మించాక ఇక్కడ ట్రాఫిక్ కష్టాలు అంతా ఇంతా కాదు. భూ సేకరణ సమయంలో జాతీయ రహదారుల సంస్థ, రాష్ట్ర రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా ఈ కూడలిలో ప్రజలకు ఇబ్బంది లేని రీతిలో నిర్మాణం చేపట్టలేదు. దీంతో విశాఖ నగరం నుంచి, పెందుర్తి సేవా రహదారి వైపు నుంచి, ఆనందపురం పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు తగరపువలస వైపునకు కేవలం 7 మీటర్ల సర్వీస్ రోడ్డు గుండా వెళ్లాల్సిన పరిస్థితి. ఒకప్పటి ఎన్ఏడీ కూడలి మాదిరి ప్రస్తుతం ఆనందపురం కూడలి దర్శనమిస్తోంది. ఈ కూడలిలో ఒకప్పుడు ట్రాఫిక్ సిబ్బంది, సూచిక వ్యవస్థ, పోలీసుల నిరంతర పర్యవేక్షణ ఉండేది. ప్రస్తుతం హెచ్చరిక బోర్డులు, జీబ్రా క్రాసింగ్, సిగ్నల్ వ్యవస్థ తదితర సూచికలేవీ లేవు. నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు, మార్కెట్‌కు వచ్చే (మిగతా 2లో)

## 'గురుద్వారా' ట్రస్ట్‌పై వివాదం



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖ నగరంలో 'గురుద్వారా'లో వివాదాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. అధ్యక్షులు దిల్బా సింగ్ ఆనంద్ ట్రస్టు ప్రయోజనాలకు వ్యతిరేకంగా నడుస్తున్నారని, చట్ట ప్రకారం పని చేయడం లేదంటూ కొందరు సభ్యులు ఆరోపణలకు దిగారు. పదవీ కాలం రెండేళ్లే అయినా..ఎనిమిదేళ్లుగా అనధికారికంగా, ఇష్టారాజ్యంగా ఆ పదవిలో కొనసాగుతున్నారని చెబుతున్నారు. నిబంధనల ప్రకారం ఎన్నికలు జరగని వ్యవహారంపై ఇప్పటికే న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిపారు. గురుద్వారాకు వచ్చే నిధులను సైతం సొంతానికి ఉపయోగించుకుంటున్నారని, నెలకు రూ.4 లక్షల వరకు వచ్చే ఆదాయాన్ని ఖర్చులుగా చూపి నిధులు దుర్వినియోగం చేస్తున్నట్లు ఆరోపించారు. ట్రస్టు సభ్యులైన అమన్‌దీప్ సింగ్, బల్విందర్ సింగ్‌లు ఈ విషయంపై కమిటీలో ఇప్పటికే పలుసార్లు ఫిర్యాదు చేసినట్లు 'ఈనాడు-ఈటీవీ'కి తెలిపారు. దిల్బాసింగ్ ఆనంద్‌కు రాష్ట్ర సింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చేందుకు అడుగులు పడుతున్న నేపథ్యంలో ట్రస్టు సభ్యులు చేస్తున్న తీవ్ర ఆరోపణలతో 'గురుద్వారా' వివాదం చర్చనీయాంశమవుతోంది. కార్పొరేషన్ ఛైర్మన్ పదవికి అనర్హుడంటూ ప్రభుత్వానికి విన్నవించేందుకు జోరుగా ప్రయత్నాలు సాగుతున్నట్లు సమాచారం.

సేవకిచ్చిన స్థలంలో వ్యాపారం: నగరం నడిబొడ్డున సింగ్ సోదరులు ప్రత్యేక పూజలకు గురుద్వారా ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు 1981లో భూమి కొనుగోలు చేసి నిర్మాణాలు చేపట్టారు. అప్పటి నుంచి జిల్లాలో సింగ్ కుటుంబీకులు పండుగలు నిర్వహించుకునే పవిత్ర స్థలంగా మారింది. ఈ తరుణంలో సింగ్‌లు ఐక్యంగా ఒక అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి 'గురుద్వారా సద్ సంగత్' అనే పేరుతో ట్రస్టు నిర్వహిస్తున్నారు. 15 మంది సభ్యులతో ఏర్పడిన ఈ (మిగతా 2లో)

## జూన్ 3 నుంచి ఏపీపీఎస్సీ గ్రూప్ 1, గ్రూప్ 2

ఏపీలో ఎన్నికల ఏడాది ఏపీపీఎస్సీ గుర్తించిన దాదాపు వెయ్యికి పైగా ఖాళీల్ని త్వరలోనే వాటిని భర్తీ చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఖాళీల భర్తీ కోసం ఏపీపీఎస్సీ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం జారీ చేయాల్సిన నోటిఫికేషన్లపై ఏపీపీఎస్సీ ఛైర్మన్ గౌతం సవాంగ్ బుధవారం కీలక ప్రకటన చేశారు. దీంతో ఈ ఏపీపీఎస్సీ ఖాళీల భర్తీపై ఓ క్లారిటీ వచ్చినట్లయింది.

మరోవైపు గతేడాది సెప్టెంబర్లో జారీ చేసిన నోటిఫికేషన్ కు సంబంధించి జరుగుతున్న ప్రక్రియను ఏపీపీఎస్సీ ఛైర్మన్ గౌతం సవాంగ్ ఇవాళ వెల్లడించారు. గత ఏడాది జారీ చేసిన గ్రూప్ 1 నోటిఫికేషన్ ప్రకారం ఇప్పటికే జనవరి 8న ప్రిలిమ్స్ పరీక్షలు జరగగా.. జూన్ 3 నుంచి 10వ తేదీ వరకూ మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తామని సవాంగ్ తెలిపారు. ప్రిలిమ్స్ పరీక్షలు జరిగిన 19 రోజుల్లోనే ఫలితాలు వెల్లడించామని, ఇందులో 6455 మంది మెయిన్స్ కు అర్హత సాధించారని సవాంగ్ వెల్లడించారు. జూన్ 3 నుంచి జరిగే మెయిన్స్ పరీక్షను 10 జిల్లాల్లోని 11 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జూన్ 3 నుంచి జరిగే గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షను ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ నిర్వహిస్తామని ఏపీపీఎస్సీ ఛైర్మన్ గౌతం సవాంగ్ వెల్లడించారు. అయితే పరీక్షా కేంద్రానికి మాత్రం ఉదయం 9.30కే చేరుకోవాలని ఆయన సూచించారు. ఉదయతం 8.30 నుంచి 9.30 వరకూ మాత్రమే పరీక్షా కేంద్రంలోకి (మిగతా 2లో)

# బీజేపీ డ్యూటీ ఎక్కిన స్టార్ పొలిటీషియన్

స్టార్ పొలిటీషియన్ ఉమ్మడి ఏపీ చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్రెడ్డి ఇప్పుడు బీజేపీలో ఉన్న విషయం తెలిసిందే. ఆదిలో ఆయన తండ్రి నుంచి వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీలో సుమారు 35 సంవత్సరాలు ఉన్నారు. దీంతో అనేక పదవులు ఆయనను వరించాయి. అయితే రాష్ట్ర విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా పార్టీ అధిష్టానం తన సూచనలు పరిగణనలోకి తీసుకోలేదని చెప్పి. పార్టీ నుంచి బయటకు వచ్చారు.ఈ క్రమంలోనే సమైక్యాంధ్ర పార్టీని స్థాపించారు. 2014లో పోటీకి కూడా అభ్యర్థులను నిలిపారు.

కానీ అందరూ ఓడిపోయారు. తర్వాత సుమారు నాలుగేళ్లపాటు రాజకీయాలకు దూరంగా ఉన్న కిరణ్కుమార్రెడ్డి మళ్లీ



కాంగ్రెస్ పిలిచిందంటూ ఆ పార్టీలోనే చేరారు. మళ్లీ పార్టీ పరిస్థితి ఎక్కడా పుంజుకునేలా కనిపించడం లేదంటూ.. ఆయన మౌనంగా ఉన్నారు. ఈ క్రమంలోనే ఆరు మాసాల కిందట ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు అయితే ఈ ఆరుమాసా ల్లోనూ కర్ణాటక ఎన్నికలు వచ్చాయి. ఒకటి రెండురోజులు అక్కడ పర్యటించి.. బీజేపీకి ఆయన ప్రచారం చేశారు. అయితే.. బీజేపీ ఓడిపోయింది. ఇక రెండు మూడు రోజుల తర్వాత ఆయన అమెరికా పర్యటనకు వెళ్లారు.

ఇదిలావుంటే.. తాజాగా ఆయన ఏపీ రాజకీయాలపై స్పందించారు. త్వరలోనే పార్టీ కార్యక్రమాల్లోపాల్గొంటానని అన్నారు. అయితే.. ఏపీలో అధికారంలో ఉన్న వైసీపీపై కానీ.. సీఎం జగన్పై కానీ ఆయన ఎక్కడా స్పందించలేదు. సమయం వచ్చినప్పుడు స్పందిస్తానని చెప్పారు. తనకు ఉన్న బలంతో బీజేపీని బలోపేతం చేస్తానని కిరణ్కుమార్రెడ్డి చెప్పారు. ఇక ఆయనను ఏపీ బీజేపీ చీఫ్ సోము వీర్రాజు కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే.. సీనియర్ నాయకుడు అయిన కిరణ్కుమార్రెడ్డి నుంచి సూచనలు.. సలహాలు తీసుకునేందుకు తాను ఆయనను కలిసినట్టు సోము చెప్పారు.

ఇదీ.. సంగతి!

వచ్చే 2024 ఎన్నికల నాటికి గౌరవ ప్రదమైన స్థానాల్లో గెలుపు గుర్రం ఎక్కాలని ఏపీపై బీజేపీ పెద్దలు వ్యూహాలు రచిస్తున్నారు. ఈక్రమంలో గత ఎన్నికలకు ముందు కాపు సామాజిక వర్గానికి వర్గానికి ప్రాధాన్యం ఇస్తూ సోము వీర్రాజును ఇక్కడ పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన నేతృత్వంలో వచ్చిన ఎన్నికలు అన్నీ కూడా విఫలమయ్యారు.ఈ క్రమంలో వచ్చే ఎన్నికల నాటికి అధ్యక్షుడిని మార్చడం ఖాయమనే సంకేతాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ పగ్గాలను కిరణ్కుమార్రెడ్డికి ఇవ్వడం ద్వారా బలమైన రెడ్డి సామాజిక వర్గాన్ని బీజేపీ వైపు ఆకర్షించి.. వైసీపీఓటు బ్యాంకు కు గండికొట్టే ప్రయత్నం చేస్తున్నారన వాదన వినిపిస్తోంది. అంటే మొత్తంగా త్వరలోనే కిరణ్కు బీజేపీ ఏపీ పగ్గాలు అందించడం ఖాయమనే లెక్కలు..సూచనలు వస్తుండడం గమనార్హం.

**పంచాంగం**

గురువారం 01-06-2022
శోభకృత్ నామ సంవత్సరము
ఉత్తరాయణం గ్రీష్మరుతువు
జ్యేష్ఠ మాసం

తిథి : శు. ద్వాదశి ఉ. 10.53

నక్షత్రం : స్వాతి పూర్తి

వర్జ్యం : ప. 10.38 ల 12.17

## రైతన్నకు అండగా జగనన్న సర్కార్

విజయనగరం: రాష్ట్రంలో గత నాలుగేళ్ల పాలనలో వ్యవసాయ రంగానికి, కర్షకులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం వరుసగా ఐదో ఏడాది రాష్ట్రంలోని రైతాంగానికి వైఎస్సార్ రైతుభరోసా - పి.ఎం.కిసాన్ పథకం సహాయం అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. కర్నూలు జిల్లా పత్తికొండలో ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.జగన్ గురువారం రాష్ట్ర స్థాయిలో ఈ సహాయం విడుదల చేస్తుండగా, జిల్లా స్థాయిలో బొబ్బిలి ఎంపిడిఓ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి శ్రీ బొత్స సత్యనారాయణ జిల్లా రైతాంగానికి రైతుభరోసా సహాయం విడుదల చేయనున్నారు. రైతుభరోసా తొలివిడత సహాయం కింద జిల్లాలో ఒక్కో రైతుకు రూ.7500 వంతున 2,58,324 మంది రైతులకు రూ.193.743 కోట్ల మొత్తాన్ని గురువారం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఈ సహాయం అందుకుంటున్న వారిలో 2,55,147 మంది భూయజమానులతో పాటు, 1,115 మంది అటవీ భూమి సాగుదారులు, 2,062 మంది కౌలురైతులు వున్నారు.

జిల్లాలో గత ఐదేళ్లలో వైఎస్సార్ రైతుభరోసా - పి.ఎం.కిసాన్ పథకం కింద రైతులకు రూ.1466.96 కోట్ల సహాయం వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యింది. 2019-20 లో 2,03,451 కుటుంబాలకే అందిన ఈ సహాయం 2023-24 నాటికి 2,58,324 కుటుంబాలకు పెరిగింది. అంటే దాదాపుగా గత నాలుగేళ్ల కాలంలో కొత్తగా 55 వేల రైతు కుటుంబాలకు ఈ సహాయం అందింది.

జిల్లాలో అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతాంగానికి కూడా ముఖ్యమంత్రి పెట్టుబడి రాయితీ విడుదల చేస్తున్నారు. జిల్లాలో 395.75 హెక్టార్ల విస్తీర్ణంలో మొక్కజొన్న పంటకు నష్టం జరిగిందని అందిన నివేదికల మేరకు జిల్లాలోని పది మండలాల్లోని 1595 మంది రైతులకు రూ.49.469 లక్షలు పెట్టుబడి రాయితీగా అందించనున్నారు. మొక్కజొన్న పంటకు హెక్టారుకు రూ.12,500 చొప్పున పెట్టుబడి రాయితీని ప్రభుత్వం మంజూరు చేసింది.

## గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ఇద్దరి అరెస్ట్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. ఇల్లందు మండలం బొజ్జాయిగూడెంలో సమ్మక్క సారక్క గద్దెల వద్ద కారులో తరలిస్తున్న 25 కేజీల గంజాయిని జిల్లా ఎన్ఫోర్స్మెంట్, ఇల్లం దు ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నింది తుల వద్ద నుంచి కారు ను సీజ్ చేశారు పోలీసులు.

నిందితులు ఒరిస్సా రాష్ట్రం మల్కన్గిరి జిల్లాకు చెందిన మహాదేవ సర్కార్, రాకేశ్ సర్దార్ గా గుర్తించారు. వీరు ఒరిస్సా నుండి మహారాష్ట్రకు గంజాయి తరలించే క్రమంలో పోలీసులకు చిక్కారు. అయి తే గంజాయి స్మగ్లర్లు సినిమా ఫక్కిలో కారు కింది భాగంలో స్టెప్నీ టైర్లో గంజాయి పెట్టి తరలిస్తున్నారు. గత కొంతకాలంగా ఇద్దరు వ్యక్తులు గంజాయి వ్యాపారం చేస్తూ ఈరోజు పట్టుపడ్డారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్ కు తరలించారు.

# అంబటికి చంద్రబాబు షాక్

వైసీపీ మంత్రి తరచుగా టీడీపీపైనా.. పార్టీ అధినేత చంద్రబాబు ఆయన కుమారుడు నారా లోకేష్.. జనసేన అధినేత పవన్ కళ్యాణ్లపై విరుచుకుపడే అంబటి రాంబాబుకు చంద్రబాబు భారీ షాక్ ఇచ్చారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సత్తెనపల్లి నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో పోటీకి బలమైన కాపు సామాజిక వర్గానికి చెందిన సీనియర్ మోస్ట్ నాయకుడు మంత్రి కన్నా లక్ష్మీనారాయణను ఇంచార్జ్గా నియమించారు. అదేసమయంలో ఆయనకు టికెట్ కూడా కన్ఫర్మ్ చేసినట్టు సమాచారం.

దీంతో అంబటి దూకుడుకు మరింత బ్రేకు పడనుందని అంటున్నారు పరిశీలకులు. వాస్తవానికి రేపల్లె నియోజకవర్గం నుంచి 1988లో విజయం దక్కించుకున్న అంబటి తర్వాత.. విజయం దక్కించుకోలేక పోయారు. 2014లో సత్తెన పల్లి నుంచి పోటీ చేసినా.. పరాజయం



పాలయ్యారు.ఇక 2019లోమాత్రం జగన్ పాదయాత్ర.. ఇతరత్రా హామీలు కలిసి వచ్చి.. ఆయన గెలుపు గుర్రం ఎక్కారు. అయితే.. ఆయనపై సొంత పార్టీలోనే నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఆయన పార్టీ నేతలను పట్టించుకోకుండా.. వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు.

ఈ సమయంలో అంబటికి సొంత పార్టీ నుంచే సెగతలుతోందనే వాదన బలంగా వినిపిస్తోంది. దీనిని గమనించిన అధిష్టానం కూడా వచ్చే ఎన్నికల్లో ఆయనను నియోజకవర్గం నుంచి తప్పించాలని ప్రయత్నించింది. ఇదిలావుంటే.. టీడీపీ తరపున.. ఇక్కడ రెండు వర్గాలు ఏర్పడ్డాయి. గత 2014లో విజయం దక్కించుకున్న కోడెల శివప్రసాద్ 2019లో పరాజయం పాలయ్యారు. ఫర్నిచర్ దొంగతనం చేశారనే కేసు పెట్టడంతో ఆయన తీవ్ర అవమానంగా భావించి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తర్వాత ఆయన కుమారుడు కోడెల శివరామకృష్ణ ఇక్కడ టికెట్ కోరుకున్నారు.

అయితే.. ఆయనకు సహకరించేందుకు పార్టీ వర్గాలు ససేమిరా అన్నాయి. దీనికితోడు స్థానిక నేతలు.. కూడా వేరేవారికి ఇవ్వాలని పట్టుబట్టాయి. ఇలాంటి సమయంలో ఉభయ కుశలోపరిగా ఉండేలా.. ముఖ్యంగా దూకుడు ప్రదర్శిస్తున్న మంత్రి అంబటికి చెక్ పెట్టేలా చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారని పార్టీ నాయకులు చెబుతున్నారు. మంచి పేరు సామాజిక వర్గంలోనూ బలమైన వ్యక్తిగా ఉన్న కన్నా లక్ష్మీనారాయణను ఇక్కడ నుంచి బరిలో నిలపడం ద్వారా.. వైసీపీకి చుక్కలు చూపించే ప్రయత్నం చేస్తున్నారని వారు చెబుతున్నారు.

## 2013కు ముందు భారత్ కాదు.. మోదీ హయాంలో అదుర్స్: మోర్గాన్ స్టాన్లీ

అమెరికాకు చెందిన గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్ మోర్గాన్ స్టాన్లీ... నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో భారతదేశ పరివర్తనను వివరిస్తూ ఒక నివేదికను విడుదల చేసింది. ప్రపంచ వేదికపై దేశ ప్రతిష్ఠ ఇనుమడించిందని కొనియాడింది. ఆసియా సహా ప్రపంచ వృద్ధి పథంలో భారత్ కీలకంగా మారినట్లు వెల్లడించింది. ప్రభుత్వ విధాన ఎంపికల కారణంగా, ముఖ్యంగా 2014 నుండి భారత్ లో గణనీయమైన మార్పు కనిపిస్తోందని వెల్లడించింది.

భారత వృద్ధిపై సంశయాన్ని వ్యక్తం చేసేవారు 2014 తర్వాత వచ్చిన మార్పులను పరిగణనలోకి తీసుకోవడం లేదని అభిప్రాయపడింది.

భారత్ ఇంకా తన పూర్తిస్థాయి శక్తిసామర్థ్యాలను అందుకోలేదని, ఇక్కడి ఈక్విటీ మార్కెట్లు అధిక ధరల వద్ద కదలాడుతున్నాయనే విమర్శలను ప్రస్తావించింది. గత తొమ్మిదేళ్లుగా వ్యవస్థాగతంగా వచ్చిన మార్పులను పరిగణలోకి తీసుకోలేదని, దీంతో ఇలాంటి విమర్శలు వస్తున్నట్లు తెలిపింది.

(మొదటి పేజీ తరువాయిలు)

### ఘనంగా జేయన్టియుకే స్నాతకోత్సవం

కళాశాలకు నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించడం ఆనందదాయకమని తెలిపారు. తొలిసారి 1974లో ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు అణు పరీక్షలు నిర్వహించి, పృధ్వి, అగ్ని, ఆకాష్, త్రిసూల్ మరియు నాగమిషేల్ వంటి ఆయుధాలు మనకు అందించిన ఘనత అబ్దుల్ కలాం అని ,ఆయన మనకి 11వ రాష్ట్రపతిగా పనిచేసే పద్మభూషణ్, భారతరత్న భారతరత్న వంటివిబిరుదులతో సత్కరింపబడిన విషయం గుర్తు చేస్తూ, కలాం చాలా వెనుకబడిన కుటుంబం నుంచి వచ్చిన వారని అన్నారు. విద్యకు ధన, పేద, కుల, మతాలు వంటివి అడ్డురావని ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఈ దేశానికి పేరు తీసుకురావాలని నజీర్ కోరారు. ఈ సందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్త మోక్షగుండం విశ్వేశ్వరయ్యను గుర్తు చేసుకుంటూ, ఒక దేశాన్ని బాగా నిర్మించగలిగితే మంచి లక్షణాలు,సమర్థత ,వ్యక్తిత్వం కలిగిన సమాజం నిర్మించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి పద్మభూషణ్, డాక్టర్ కి వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ఇదే కళాశాలలో మాకు పాటలతో పాటు వ్యక్తిత్వం, వికాసము నేర్పి మంచి అభిరుచులు అందజేసి మమ్మల్ని సమాజంలోకి పంపించిన ఘనత జేఎన్ టీయూకే చెందుతుందని కితాబిచ్చారు. ఎలక్ట్రానిక్స్ రంగము, బయో మెడికల్ రంగము లలో ప్రస్తుతం ప్రపంచం ముందడుగు వేస్తోందని ఈ రంగాలలో తాను విజయం సాధించాలని తెలుపుతూ,ఇందుకు కారణం అయిన తన గురువులందరికి పాదాభివందనం చేశారు. ఇక్కడ చదువుకుని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసి విగ్గ్ విమానాల కు వాడే బ్యాటరీ లు దేశీయంగా తయారు చేసే సంస్థలో కొంతకాలం పనిచేసి తరువాత బయో ఫార్మా రంగానికి వెళ్లానని, ప్రస్తుతం తాను ఎంటర్ప్రెట్కనార్ గా మారానని తెలిపారు. హెపటైటిస్ బి వాక్సిన్ పరిశోధన అభివృద్ధి చేయించి ఉత్పత్తి చేసి 1997 నాటికి మార్కెట్లో తక్కువ ధరకు తీసుకువచ్చి గుర్తింపు పొందానని తెలిపారు. కాబట్టి ఇంజనీరింగ్ విద్యార్థిని విద్యార్థులు ఆర్ అండ్ డి పై శ్రద్ధ పెట్టి ఉద్యోగ ప్రదాతలుగా మారాలని సూచించారు. అమెరికాలో సేవా రంగంలో వస్తున్న ఆటుపోట్లతో సతమతమై చివరకు వారు కూడా ఆర్ అండ్ డి కి ఉద్యోగ ప్రదాతలగా మారాలని ప్రబోధిస్తున్నారన్నారు. మేక్ ఇన్ ఇండియా, మేడిన్ ఇండియా వంటి నినాదం తో ముందుకు వెళ్లాలని ప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. అలాగే గత కొంతకాలంగా ఆర్ అండ్ డి పట్ల కేంద్ర ప్రభుత్వం పెద్దగా శ్రద్ధ చూపట్లేదు అన్నారు. దీని వల్ల యువతలో నైపుణ్యం తగ్గే అవకాశాలు ఎక్కువ ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫసర్ జివిఆర్ ప్రసాద్ రాజు మాట్లాడుతూ, జై యన్ టి యు కే పుట్టుపూర్వోత్తరాలు తెలిపుతూ ,దీని పరిధిలో 160 సొంత ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయని, 11 జిల్లాల్లో ఈ వ్యాపించి సుమారు రెండు లక్షల యాభై వేల మంది విద్యార్థిని విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఇందులో 28 మంది స్వయం ప్రతిపత్తి కాలేజీలు , 118 ఇంజనీరింగ్ కాలేజీలు, 30 ఫార్మసీ, 11 ఎంబీఏ ,ఎంసీఏ కాలేజీలు ఉన్నాయన్నారు. 56 యూజీ ప్రోగ్రామ్స్ ను బీటెక్ ఎలక్ట్రానిక్స్, ఇంజనీరింగ్ మరియు 144 మాస్టర్స్ ప్రోగ్రామ్స్, ఎంటెక్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రాములు జరిగే వీలు కలదని అన్నారు. అలాగే క్రీడలు నిర్వహించి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై సత్తామని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, ఈ కళాశాలలో చదివి శాస్త్రవేత్తలుగా ,ఇంజనీర్లుగా దేశవ్యాప్తంగా ప్రపంచవ్యాప్తంగా సేవ చేస్తున్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు వెళ్లాలని సత్యనారాయణ కోరుకుంటూ జే యన్ టి యు కే ద్వారా సమాజాభివృద్ధికి పాటుపడే యువతను తయారు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఫౌండేషన్ విద్య నుండి కళాశాల విద్య వరకు పాఠ్యపుస్తకాల అంశాలతో పాటు ఇతర సాంకేతిక అంశాలపై కూడా విద్య జరిగే విధంగా చర్యలు చేసుకుంటున్నారని ,రాబోయే కాలంలో అవి సఫలీకృతం అవుతాయని ఆశించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ కో ప్రాజెక్ట్స్ సిఈఓ చలమలశెట్టి అనిల్ కు గౌరవ డాక్టరేట్ ను రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్య అతిథి డాక్టర్ కి వరప్రసాద్ రెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా వైస్ ఛాన్సలర్ ప్రసాదరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దాడిశెట్టి రాజా, పినిపే విశ్వరూప్ , ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, ఎమ్మెల్యేలు ద్వారపూడి చంద్రశేఖర్ రెడ్డి, కురసాల కన్నబాబు ,పెండేం దొరబాబు,రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ దవులూరి దొరబాబుతో పాటు మాజీ ఉప కులపతులు పాల్గొన్నారు. అనంతరం పిహెచ్డి అవార్డు గ్రహీతలకు, బీటెక్ కు, బి ఫార్మసీ, ఎంబీఏ ,ఎంసీఏ ,ఎం ఫార్మసీ ,బి బి ఏ, ఎం ఎస్ ఐ టి ఫార్మాట్ విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేసారు 2020 21, 21- 22, విద్యా సంవత్సరం సంబంధించి స

బీటెక్ విద్యార్థులు 1,07'610 మందికి , బీఫార్మసీ విద్యార్థులు 3845, ఎంటెక్ విద్యార్థులు 2535, ఎంబీఏ 3348, ఎంసీఏ 989,ఎంసీఏ645, బిబిఏ 33, ఎమ్మెస్ ఐటి రెండు, ఫార్మా డి 468, బి ఆర్ కు 124 పీహెచ్డీ 144 డిగ్రీలు ప్రథమ చేస్తానన్నారు. అలాగే 66 బంగారుపతకాలు అందించారు. ఈ సమావేశంలో రెక్టార్ ప్రొ కె.వి.రమణ, రిజిస్టర్ యల్.సుమలత, పో.డి.కోటేశ్వరరావు, ప్రో.సి.హెచ్. సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

### సుబంసిరి జలవిద్యుత్ ప్రాజెక్టుపై కేంద్రమంత్రి సమీక్ష

ఒక అద్భుతమైన ఫీట్గా చెప్పుకోవచ్చు. అంతేకాక, నదీ ముఖంగా ఉన్న విద్యుత్ కేంద్ర గోడను 116 మీటర్ల సురక్షిత ఎత్తువరకు పెంచడమే కాక అన్ని యూనిట్లకు టెయిల్ రేస్ ఛానెల్ ( ఆనకట్ట నుంచి నీటిని తీసుకుపోయే కాలువ) ను పూర్తి చేశారు. నీటి వాహక వ్యవస్థ ఇప్పుడు దాదాపు సిద్ధమైంది.

సమీక్ష అనంతరం, పని పురోగతిపై కేంద్ర మంత్రి సంతృప్తిని వ్యక్తం చేసి, అవసరమైన ముందస్తు భద్రతా చర్యలతో ముందుకు వెళ్ళవలసిందిగా ఎన్హెచ్పిసిని ఆదేశించారు. రానున్న డిసెంబర్ లేదా 2024 జనవరిలో 250 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన తొలి యూనిట్ను ప్రారంభించేందుకు కంపెనీ కృషి చేస్తోందని ఎన్హెచ్పిసి సిఎండి హామీ ఇచ్చారు.

సమావేశానికి విద్యుత్ మంత్రిత్వ శాఖ, కేంద్ర విద్యుత్ ప్రాధికరణ సంస్థ, ఎన్హెచ్పిసికు చెందిన సీనియర్ అధికారులతో కలిసి మంత్రిత్వ శాఖ కార్యదర్శి (విద్యుత్) హాజరయ్యారు.

### మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై జిల్లాస్థాయి సమీక్ష

మత్తుపదార్థాల వినియోగం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి , విద్యార్థులను మత్తు పదార్థాలకు దూరంగా ఉండేటట్లు కౌన్సిలింగ్ చేయాలని అన్నారు. గంజాయి, డ్రగ్స్ రవాణా చేసే వారిని జోన్ల వారీగా విభజించి , వారందనిని కౌన్సిలింగ్ సెంటర్లకు పిలిచి కౌన్సిలింగ్ చేయాలని , అప్పటికి మారకపోతే పీడీ యాక్ట్ అమలు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. డ్రగ్స్ ప్రభావం వలన తల్లిదండ్రులు కష్టపడి చదివించి గొప్పవాళ్ళను చేయాలనుకున్న ఆశలు అడియాశలవుతున్నాయని, వాటి బారిన పడితే భవిష్యత్తు అంధకారం అవుతుందని అన్నారు . విద్యార్థులు యుక్త వయసులో చెడు అలవాట్లకు గురికాకుండా తమ అందమైన భవిష్యత్తుని పాడు చేసుకోకుండా సక్రమమైన మార్గంలో నడవాలని కోరారు. తల్లిదండ్రులు యుక్త వయసులో ఉన్న తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాల అలవాటు మానుకోలేని వారిని డి అడిక్షన్ సెంటర్లకు పంపి కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు . డ్రగ్స్ వినియోగాన్ని తక్షణమే గుర్తించుటకు అవసరమైన సామాగ్రిని కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. గంజాయి, డ్రగ్స్ కేసులలో షూరిటీలు సమర్పించు వారి వివరాలు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. మత్తు పదార్థాలకు సంబంధించి ఎటువంటి సమాచారమైనా టోల్ ఫ్రీ నెంబర్ 14500 తెలియజేయాలని అన్నారు. గంజా రవాణా పూర్తి స్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పోలీస్ , పోర్ట్, కోస్ట్ గార్డ్ , మెడికల్ , విద్యా శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు .

డిసిపి విద్యా సాగర్ నాయుడు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగానికి వ్యతిరేకంగా జివిఎంసి , ఆటో యూనియన్స్ తో సమావేశాలు నిర్వహించామని తెలిపారు. ఆర్టీసీ బస్సుల ద్వారా ఒడిశా నుంచి మనకు అధిక గాంజా రవాణా జరుగుతున్నట్లు వివరించారు.

గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల బారిన పడిన యువకులు సత్ ప్రవర్తన మార్గంలో నడుచుకోవడానికి ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అంతకు ముందుగా అడిషనల్ సూపరింటెండెంట్, ఎస్ ఈ బి, బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ 191 కేసుల్లో 7547.7 కిలోల గంజాయి మరియు 27.4 కిలోల హషీష్ ఆయిల్ను స్వాధీనం చేసుకున్నామని , మరియు 01.01.2023 నుండి 30.05.2023 వరకు 474 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం 183 కేసులు పెండింగ్లో ఉన్నాయని, 60 కేసులు ఛార్జ్ షీట్లు వేసినట్లు తెలిపారు . సింథటిక్ డ్రగ్ కేసుల్లో నగరంలో 85 మంది డ్రగ్ ఎండ్ యూజర్లను గుర్తించినట్లు తెలిపారు.

విద్యార్థులు మరియు ప్రజలకు డ్రగ్స్ వినియోగం పట్ల అన్ని రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ , బి. శ్రీనాధుడు,ఎ ఈ ఎస్, పోలీస్ , పోర్ట్, కోస్ట్ గార్డ్ , మెడికల్ , ఫారెస్ట్ , కస్టమ్స్, కేజిహెచ్ , డ్రగ్స్ కంట్రోల్ , సి ఐ ఎస్ ఎఫ్ , విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

### ఆనందపురం కూడలిలో... నిత్యం అష్టకష్టాలే..

క్రయవిక్రయదారులు, వేర్వేరు ప్రాంతాలకు ప్రయాణించే వారి నడుమ ఇక్కడ ట్రాఫిక్ గందరగోళంగా ఉంటోంది. ఈ సమస్యపై జాతీయ రహదారుల సంస్థ సిబ్బంది వద్ద ప్రస్తావించగా.. ఇప్పుడు నిర్మించిన రోడ్డును మార్పు చేయడానికి అవకాశం లేదని అన్నారు. గతంలో నిర్ణయించిన విధంగా పూల మార్కెట్లో కొద్ది ప్రాంతం, గ్రామ పంచాయతీ కార్యాలయం, మంచినీటి ట్యాంక్ పూర్తిగాబీ సమీప ప్రైవేటు స్థలంలో కొంత భాగం తొలగించి మార్కెట్ వైపు విస్తరించాల్సి ఉందన్నారు.

### 'గురుద్వారా' ట్రస్ట్పై వివాదం

ట్రస్టులో దిల్బా సింగ్ ఆనంద్ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన తరువాత పలు ఆరోపణలు వచ్చాయి. గురుద్వారా మందిరానికి ఆనుకుని జీవీఎంసీ గ్రీన్ బెల్ట్ స్థలం 600 చదరపు గజాల్లో మొక్కలతో సుందరీకరణ చేసుకునేలా ట్రస్టుకు జీవీఎంసీ అనుమతిచ్చింది. గ్రీన్బెల్ట్ స్థలాన్ని దుకాణాలుగా మార్చి అద్దెకు ఇచ్చినట్లు అధ్యక్షునిపై ఆరోపణలున్నాయి. ప్రభుత్వ భూమిలో ఇలా వ్యాపారం చేయడం నిజమేనని తేలడంతో ఇటీవల దుకాణాలను జీవీఎంసీ తొలగించింది. దీంతో అధ్యక్షునికి అడ్వాన్సులు చెల్లించిన వ్యాపారులు వెనక్కి ఇచ్చేయాలని కోరుతున్నా చెల్లించడం లేదని తెలిపారు. ఏడాది కాలంగా ఇలా గ్రీన్బెల్ట్లో దుకాణాల ద్వారా ఆదాయం, గురుద్వారాకు భక్తుల నుంచి వచ్చే ఆదాయంపై సరైన లెక్కలు చూపక జేబులు నింపేసుకుంటున్నారని పలువురు ట్రస్టు సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ అంశాలపై వివరణ తీసుకునేందుకు అధ్యక్షున్ని ఫోన్లో సంప్రదించగా స్పందించలేదు.

### జూన్ 3 నుంచి ఏపీపీఎస్సీ గ్రూప్ 1, గ్రూప్ 2

అభ్యర్థుల్ని అనుమతిస్తామన్నారు. అయితే 15 నిమిషాల గ్రేస్ పీరియడ్ ను కూడా ఇస్తామన్నారు. వీటి ఫలితాలను జూలైలో విడుదల చేసి ఆగస్టులో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని సవాంగ్ వెల్లడించారు.

# విశాఖ సమాచారమ్

గురువారం 01-06-2023

## సీనియర్ సిటిజన్స్ దయచేసి గమనించండి!

యునైటెడ్ స్టేట్ లో జరిపిన ఒక అధ్యయనం ప్రకారం 51% పైగా వృద్ధులు మెట్లు ఎక్కేటప్పుడు పడిపోతారు. ప్రతి సంవత్సరం, చాలా మంది అమెరికన్లు మెట్లు ఎక్కేటప్పుడు పడి చనిపోయారు.

నిపుణుల రిమైండర్: 60 సంవత్సరాల తరువాత, ఈ 10 చర్యలకు దూరంగా ఉండాలి.

1. మెట్లు ఎక్కవద్దు. మీరు తప్పక ఎక్కితే, మెట్ల కేసు రైలింగ్‌లను గట్టిగా పట్టుకొని ఎక్కండి
2. మీ తలను వేగంగా తిప్పకండి. కళ్ళు బైర్లు కమ్మి మీరు క్రింద పడిపోవచ్చులి
3. మీ కాలి బొటనవేలును తాకడానికి మీ శరీరాన్ని వంచవద్దు. మొదట మీ శరీరాన్ని సిద్ధం చేసుకోండి.
4. మీ ప్యాంటు ధరించడానికి నిలబడకండి. కూర్చుని మీ ప్యాంటు ధరించండి.
5. నిలబడి ఒక్కసారి గా పడుకోకుండా మీ శరీరం యొక్క ఒక వైపు (ఎడమ చేతి వైపు, లేదా కుడి చేతి వైపు) నుండి కూర్చొని పడుకోండి.లి
6. వ్యాయామానికి ముందు మీ శరీరాన్ని ట్విస్ట్ చేయవద్దు. మొదట మీ శరీరాన్ని సిద్ధం చేసుకోండ్నిలి
7. వెనుకకు నడవకండి. వెనుకకు పడటం వలన తీవ్రమైన గాయం అవుతుంది.
8. భారీ బరువును ఎత్తడానికి నడుము వంచవద్దు. మీ మోకాళ్ళను వంచి, సగం చతికిలబడినప్పుడు వస్తువును పైకి ఎత్తండి.
9. మంచం మీద నుండి వేగంగా లేవకండి. మంచం నుండి లేవడానికి ముందు కొన్ని నిమిషాలు వేచి ఉండండి.
10. వాష్‌రూమ్‌లో అధిక శక్తిని ఉపయోగించవద్దు. ఇది సహజంగా రావనివ్వండి.

ఇంకొక ముఖ్యమైన విషయం ఏమిటంటే, మీరు ఎల్లప్పుడూ చురుకుగా ఉండాలి మరియు అన్ని బాదలకి దివ్య ఔషదం చిరునవ్వు ఒకటే ఎన్ని కష్టాలు వచ్చినా సరే గుండె నిబ్బరంతో ఉంటూ పెదవులపై నీ చిరునవ్వు ని ఎప్పటికి చెదరనివ్వకు నేస్తం.

## ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ 'బంగారు రుణ మేళా'




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఐఐఎఫ్ఎల్ ఫినాన్స్ 'బంగారు రుణ మేళా' ఈనెల 15న ప్రారంభమైందని, జూన్ 30వ తేదీ వరకు కొనసాగనుందని ఐఐఎఫ్ఎల్ అధికారి సౌరభ్ కుమార్ తెలిపారు. ఈ మధ్య కాలంలో బంగారు రుణాలు తీసుకునే వారు కార్, ఎలక్ట్రిక్ స్కూటర్ , 32 అంగులాల ఎల్ఈడి టీవీ, ఫ్రిడ్జు, స్మార్ట్ఫోన్లు తదితర ఇంకెన్నో బాహుమతులు పొందే అవకాశం ఉందన్నారు. వినియోగదారుల నమ్మకం అనేది ఐఐఎఫ్ఎల్ ఫినాన్స్ కి ఒక వరం అన్నారు. ఐఐఎఫ్ఎల్ బంగారు రుణ మేలా అనేది అందరికీ ఆఫర్స్ ని అందించే ఒక పెద్ద కార్యక్రమం అన్నారు. ఆకర్షణీయమైన బాహుమతులతో పాటు ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ నెలకి ఆకర్షణీయమైన వడ్డీ రేట్లని త్వరగా అమలు చేసే విధంగా ఒక నిబద్దత తో అత్యధిక లోన్ విలువని, సరళమైన డిజిటల్ చెల్లింపులతో రుణాల ఎంపికలని అందిస్తుందని తెలిపారు.

బంగారు రుణ మేళాలో పాల్గొనడానికి వినియోగదారులు ఏదైనా ఐఐఎఫ్ఎల్ ఫినాన్స్ శాఖ ని సందర్శించవచ్చని, లేదా సంస్థ వెబ్సైట్ లో ఆన్లైన్ లో అప్లై చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హత, కాంటెస్ట్ షరతులు, నిబంధనలను వెబ్సైట్ లో చూడవచ్చని తెలిపారు. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ ఇండియాలో వేగవంతంగా పెరిగే ఒక అతి పెద్ద రిటైల్ వ్యాపారాన్ని కేంద్రీకృతం చేసే ఒక ఫైనాన్స్ సంస్థ అన్నారు.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

టెండర్ నోటీస్ సంఖ్య : VSKP-ELECTG-23-24-WC-5 తేదీ : 29.05.2023

పని పేరు : ఈస్ట్ కోస్ట్ రైల్వేలో (విశాఖపట్నం అధికార పరిధి) వాల్తేయిర్ డివిజన్ కోస్టల్ బెల్ట్ మీదుగా భూగర్భ కేబుల్‌తో ఓవర్‌హెడ్ లైన్‌ల భర్తీ.

సుమారు పని ఖర్చు: ₹ 5,13,92,242.58, బయానా : ₹ 4,07,000/-. పని పూర్తి చేయు కాలం: 180 నెలలు.

సుటెండర్ ముగింపు తేదీ సమయం: 1330 గంటలకు. 27.06.2023. టెండర్ తెరవబడిన తేదీ మరియు సమయం: 1600 గంటలకు. 27.06.2023.

టెండర్ డాక్యుమెంట్ల పూర్తి వివరాలు http://www.ireps.gov.inలో అందుబాటులో ఉన్నాయి. ఏదైనా కొరిజెండమ్ జారీ చేయాలంటే టెండరుదారు వెబ్‌సైట్ను చూడవలసి ఉంటుంది.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (జి), వాల్తెయిర్

PR-229/O/23-24

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

(1) ప్రకటన నెం. eT-East-WAT-15-2023, తేది. 20.05.2023

పని పేరు: అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు/శ్రీకాకుళం రోడ్డు వారి పరిధిలో మెయిన్ లైను మరియు నౌపడ-గుణుపూర్ NG లైను పైన పాందూరు (EX)-పలాస (EX) మధ్య సెక్షన్ నందు 30.06.2024 కాలం ముగిసే వరకు సివిల్ జోనల్ పనులు.

సుమారు పని విలువ: ₹ 1,45,61,933.37, బయానా: ₹ 2,22,800/-.

(2) ప్రకటన నెం. eT-East-WAT-16-2023, తేది. 20.05.2023

పని పేరు: వాల్తేరు డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు/విజయనగరం వారి పరిధిలో మెయిన్ లైను మరియు నౌపడ-గుణుపూర్ NG లైను పైన కోరుకొండ (IN)-పొందూరు (IN) & విజయనగరం (EX)-డొంకినవలస (EX) మధ్య సెక్షన్ నందు 30.06.2024 కాలం ముగిసే వరకు సివిల్ జోనల్ పనులు.

సుమారు పని విలువ: ₹ 1,47,48,691.09 బయానా: ₹ 2,23,800/-.

పని పూర్తి చేయు కాలం: (రెండు టెండర్లకు) 12 (పన్నెండు) నెలలు.

టెండరు ముగింపు తేదీ & సమయం: (రెండు టెండర్లకు) 13.06.2023న 1500 గంటలు.

ఇందుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు ఇ-టెండర్లకు సంబంధించి పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా తమ సంస్థ లెటర్ హెడ్స్ పైన, సకాలంలో అందునట్లు పంపినప్పటికి అంగీకరించబడవు. అట్టి అన్ని మాన్యువల్ ఆఫర్లు చెల్లుబాటు కానివిగా పరిగణించబడతాయి మరియు ఎలాంటి పరిశీలన లేకుండానే తిరస్కరించబడతాయి.

పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు http://www.ireps.gov.in వెబ్‌సైట్ నందు లభిస్తాయి.

సూచన: విశ్వసనీయ టెండరుదారులు ఈ టెండరుకు సంబంధించి ఏదైనా మార్పులు/సవరణలు కోసం టెండరు ముగింపు తేదీకి 15 (పదిహేను) రోజులు ముందుగా ఈ టెండరును మరొకసారి చూడవలసినదిగా సలహాయీయటమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇంజనీరింగ్) వాల్తేరు

PR-224/O/23-24


## అక్రమంగా నిర్మిస్తున్న వైకాపా పార్టీ కార్యాలయాన్ని తొలగించండి

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కాపు భవనం కోసం కేటాయించిన స్థలాన్ని మంత్రి గుడివాడ అమర్నాథ్ దౌర్జన్యంగా వైకాపా పార్టీ కార్యాలయనికి కేటాయించడం తగదని టిడిపి అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ పీ లా గోవింద సత్యనారాయణ అన్నారు. కేఎన్ఆర్ పేటలో వైకాపా పార్టీ అక్రమంగా నిర్మిస్తున్న పార్టీ కార్యాలయాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.పేద వాడు చిన్న షెడ్డు కట్టుకుంటే విరుచుకుపడే జీవీఎంసీ అధికారులకు ఇదేమి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. వారం రోజుల్లోగా వైకాపా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని తొలగించకపోతే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. బుధవారం జీవీఎంసీ 84వ వార్డు కే ఎన్ ఆర్ పేటలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వైకాపా పార్టీ కార్యాలయాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ మాజీ శాసనసభ్యులు పీలా జోనల్ కమిషనర్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. విలీన గ్రామాల ప్రజలు ఎన్నిసార్లు చెప్పిన అధికారులూ పట్టించుకోవడం లేదని అన్నారు. మంత్రి గుడివాడ అమర్నాథ్ కాపుల సంక్షేమాన్ని గాలికి వదిలేసారని అన్నారు. న్యాయస్థానాలను కూడా వైకాపా ప్రభుత్వం గౌరవించడం లేదని అన్నారు. టీడీపి అధికారంలోకి రాగానే స్థల లీజుని రద్దు చేసి ప్రజా అవసరాలకు వినియోగిస్తామని అన్నారు. కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనం వృధా అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో 84వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చిన తల్లి నీలబాబు, మళ్ళ సురేంద్ర, సిరసపల్లి సన్యాసి రావు, కసిరెడ్డి సత్యనారాయణ, బొడ్డేడ జోగీ నాయుడు, సబ్బవరపు గణేష్,కనుమరెడ్డి గోవిందా, యర్రా సత్యనారాయణ, పొలారపు త్రినాథ్, సురేష్, తలారి కాశీ నాయుడు, సూరి సతీశ్ కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## పార్టీలతో సంబంధం లేదు.. ఎవరితోనైనా కలిసి పని చేస్తా

విజయవాడ ఎంపీ, టీడీపీ నేత కేశినేని నాని బుధవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో పోటీపై స్పందించారు. ఎంపీగా టీడీపీ ఏ పిట్టల దొరకు టిక్కెట్ ఇచ్చినా తనకు అభ్యంతరం లేదని, తాను ఇండిపెండెంట్ గా పోటీ చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ప్రజలు తనను మరోసారి కోరుకుంటే గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

తన వ్యాఖ్యలను పార్టీ ఎలా తీసుకున్నా తనకు అభ్యంతరం లేదన్నారు. అభివృద్ధి విషయంలో తనకు పార్టీలతో సంబంధం లేదని, ఎవరితోనైనా కలిసి పని చేస్తానన్నారు. తన మనస్తత్వానికి సరిపోతుందనుకుంటే ఏ పార్టీ అయినా ఇబ్బంది లేదన్నారు.


**విశాఖ సమాచారమ్**

ప్రతులకు, ప్రకటనలకు

సెల్: 9393949345

8247526179


## కొడాలి నాని పై కఠిన చర్యలు తీసుకోవాలి



**గాజువాక, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రంలో కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్న గుడివాడ శాసనసభ్యుడు మాజీ మంత్రి కొడాలి నాని పై తక్షణమే FIR నమోదు చేసి చర్యలు తీసుకోవాలి అని, శాసన సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలనీ గాజువాక తెలుగుయువత అధ్యక్షుడు బలగ బాలు నాయుడు డిమాండ్ చేసారు. కొడాలి నాని కాపుల పై చేసిన దూషణలకు తక్షణమే బేషరుతగా క్షమాపణలు తెలపాలని, లేని పక్షంలో రాష్ట్రంలో కాపుల ఆగ్రహానికి కొడాలి నాని గురికాక తప్పదని హెచ్చరించారు. అనంతరం నియోజకవర్గ తెలుగుయువత నాయకులతో కలసి గాజువాక పోలీస్ స్టేషన్లో కొడాలి నాని పై ఫిర్యాదుని పోలీస్ వారికీ అందచేసారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత నియోజక వర్గ ఉపాధ్యక్షుడు అమరపిన్ని కొండల రావు తెలుగు యువత వార్డు అధ్యక్షులు రమేష్, అప్పలరాజు, కోలాగని శ్రీను, యువత నాయకులు పాల్గొన్నారు.

## పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 8 కిలోమీటర్ల ర్యాలీ



**గాజువాక, (విశాఖ సమాచారమ్):** గ్రేటర్ విశాఖపట్నం సాయిరాం నగర్ హై స్కూల్ రోడ్ గాజువాక. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కమిటీ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వివిధ రూపాలలో అనగా సభలు, సమావేశాలు, ర్యాలీల ద్వారా పొగాకు ఉత్పత్తుల నుండి జరిగే నష్టాలను వివరించాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్వామి విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థులు స్కౌట్స్ మరియు గైడ్స్ & కబ్స్ మరియు బుల్బుల్స్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా విచ్చేసినటువంటి విశాఖపట్నం రీజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి హేమలతతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర హక్కుల సంఘం మాజీ అధ్యక్షులు తుంపాల శ్రీరామ్ మూర్తి గారు మొదట జెండా ఊపి ర్యాలీని ప్రారంభించగా ఆ ర్యాలీ స్వామి విద్యానికేతన్ నుండి హై స్కూల్ రోడ్డు కలుపుతూ జింక్ స్మెల్టర్ గేటు వరకు అక్కడి నుండి కొత్త గాజువాకను కలుపుతూ పాత గాజువాక ఆటోనగర్ మీదుగా జాగవానపాలెం, అశోక్ నగర్, మారుతి నగర్, శంకర నగర్, సాయిరాం నగర్‌ను కలుపుతూ మొదట మూడు కిలోమీటర్లు ర్యాలీగా భావించి పిల్లలు ఉపాధ్యాయులు వచ్చిన ముఖ్య అతిధుల ప్రోత్సాహంతో సుమారు ఎనిమిది కిలోమీటర్లు ర్యాలీ నిర్వహించారు. సుమారు 15 స్థలాల్లో సమావేశాలు ఏర్పరచి పొగాకు ఉత్పత్తుల వల్ల జరిగే నష్టాలను వివరించారు. అంతేకాకుండా దారి పొడవున పొగాకు ఉత్పత్తుల వల్ల జరిగే నష్టాలను వివరించే బోర్డులను చూపిస్తూ 'పొగాకు కాదు ఇది ప్రాణాలకు పగాకు' మరియు 'మాకు ఆహారం కావాలి కానీ పొగాకు కాదు' అనే థీమ్ వివరిస్తూ ర్యాలీ పొడవునా స్లొగన్ లతో విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు 67వ వార్డు మొత్తం ప్రతి వీధిని కలుపుతూ ప్రజలకు పొగాకు ఉత్పత్తులు వలన నష్టాలను వివరించారు. స్వామి విద్యానికేతన్ స్కూల్ ప్రిన్సిపల్ మరియు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విశాఖపట్నం ఇన్స్టిట్యూషనల్ కౌన్సిలర్ ( హెచ్ డబ్ల్యు సి స్కౌట్స్ ) డాక్టర్ పాలూరు లక్ష్మణ స్వామి మాట్లాడుతూ గుండెకు ఊపిరి తిత్తులకు మరియు శరీరంలోని వివిధ భాగాలలో వచ్చే 72 రకాల క్యాన్సర్లకు కారణమంటూ ప్రపంచ దేశాలలో ప్రతి సంవత్సరం సుమారు 70 లక్షల వరకు ఈ మహమ్మారి కారణంగా చనిపోతున్నారని చెబుతూ ఒక్క భారతదేశంలోనే 13.5 లక్షల మంది ప్రజలు చనిపోతున్నారనీ అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వివరించారు. నిరక్షరాస్యులతో పాటు చదువుకున్న వారు దీనికి అలవాటు పడుతున్నారని చెబుతూ దంత చిగుళ్ళు, నాలుక, గర్భం మొదలగునవి పొగాకు ఉత్పత్తులలో కైని, గుట్కా, పాన్ పరాగ్, సిగరెట్లు, బీడీలు, చుట్టలు, సిగరెట్లు మొదలగు వాటి వలన గుండె ఊపిరితిత్తులు, సంతానలేమి సమస్యలు వస్తాయని దారి పొడవునా వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి విశాఖపట్నం మెడికల్ రీజనల్ ఆఫీసర్ డాక్టర్ పి హేమలత మాట్లాడుతూ పొగాకు వలన మెదడు, రక్తనాళాలలో పూడిక వల్ల పక్షవాతం వచ్చే అవకాశం ఉంటుందని నికోటిన్ వల్ల గర్భాశయ, క్యాన్సర్ ప్రమాదం ఉంటుందని పొగలోని విష పదార్థాలతో గాలి గొట్టాల గదులకు కోలుకోలేని స్థాయిలో ప్రమాదం ఉంటుందని ఊపిరితిత్తుల్లోని రక్తనాళాలు దెబ్బతినడం వలన శరీరంలోని అవయవాలకు ఆక్సిజన్ సరఫరా తగ్గుతుందని గుండెపోటు కేసులలో 25 శాతం పొగ త్రాగే అలవాటే కారణం మరియు గర్భం దాల్చిన నెలలు నిండకముందే కాన్పు, గ్రహణం మొర్రి తో బిడ్డలు జన్మించే ఆస్కారం, గుట్కా కైని నోటి ద్వారా ప్లేగులోకి వెళ్లి పేగు క్యాన్సర్ కు ఆస్కారం ఉంటుంది మరియు ఇవి నమలడం వల్ల ఆకలి మందగించడం జరుగుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర హక్కుల సంఘం మాజీ అధ్యక్షులు తుంపాల శ్రీరామమూర్తి మాట్లాడుతూ పొగాకులోని విషకారకాల వల్ల రోగ నిరోధక వ్యవస్థకు ప్రమాదం ఉంటుందని, పొగాకు వినియోగం కారణంగా లైంగిక సంపర్కం ద్వారా మగవారికి కూడా హెచ్ఐవి సోకే ప్రమాదం ఉంటుందని, పొగ త్రాగే వారికి శుక్ర కణాలు దెబ్బతిని సంతానలేమి సమస్యలు, ఆడవారు పొగాకును పీల్చితే గర్భం ధరించిన సమయంలో పిండం ఎదుగుదలపై ప్రభావం ఉంటుందని అన్నారు. ప్రభుత్వాలు రైతులకు ప్రత్యామ్నాయ పంటలకు వివిధ సబ్సిడీల రూపంలో సహాయ సహకారాలు అందించి వారు వేరే పంటలపై దృష్టి సారించి ఈ మహమ్మారి పంటకు దూరంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవలసిన బాధ్యత పాలకులపై ఉందని నొక్కి వక్కాణించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ పద్మజా, లక్ష్మీ, ఉపాధ్యాయులు లక్ష్మణ్ రావు, కుమార్, ఇమ్రాన్, సాయిరాం నగర్ పెద్ద వైయస్ జి.ఆర్ నాయుడు, పాఠశాల పూర్వపు విద్యార్థులు ఇప్పటికే రాష్ట్రపతి అర్హత పరీక్షకి మరియు గవర్నర్ అర్హత పరీక్షకి హాజరైనటువంటి విద్యార్థులు కూడా పాల్గొన్నట్లు స్కూల్ కరెస్పాండెంట్ పాలూరు దేవి తెలిపారు. చివరగా స్వామి విద్యానికేతన్ హై స్కూల్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు ఉదయం 8 గంటల నుండి 11:30 వరకు సుమారు మూడున్నర గంటల పాటు ర్యాలీలో పాల్గొనడం చాలా ఆనందదాయకమైన టువంటి విషయంగా భావిస్తూ విద్యార్థులకు మిఠాయిలను పంచిపెట్టారు.

## కార్పొరేట్ శక్తుల నుండి దేశాన్ని కాపాడుకోవడం కార్మికుల కర్తవ్యం



**గాజువాక, (విశాఖ సమాచారమ్):** దేశ పాలకులు అనుసరిస్తున్న విధానాల మూలంగా లబ్ధి పొందే కార్పొరేట్ శక్తుల నుండి దేశాన్ని కాపాడుకోవడం కార్మికుల కర్తవ్యం అని రాష్ట్ర సిఐటియు అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. నేడు ఉక్కునగరంలోని సిఐటియు కార్యాలయంలో స్టీల్ సిఐటియు, కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా" కార్మిక ఉద్యమం- నూతన పరిస్థితులు" అనే అంశంపై సదస్సు నిర్వహించారు.

ఈ సదస్సుకు ముఖ్య వక్తగా విచ్చేసిన నాగేశ్వరరావు మాట్లాడుతూ సిఐటియు లక్ష్యం కార్మికులను, సంఘాలను ఐక్యపరచి ఐక్య ఉద్యమాలతో ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై అనునిత్యం ప్రతిఘటిస్తున్నామని ఆయన తెలిపారు. రాజకీయ రూపంలో ఆవిర్భవించే నియంతృత్వ నాయకుల కారణంగా వ్యవస్థలు గాడి తప్పుతున్నాయని ఆయన అన్నారు. తమ రాజకీయ అధికారాన్ని పటిష్ట పరచుకోవడానికి ఒకవైపు వివిధ జాతీయ, ధార్మిక విధానాలను ప్రచారం చేస్తూ మరోవైపు తమ లక్ష్యానికి అనుగుణంగా పాలన, రాజకీయ వ్యవస్థలను సంస్కరణల పేరుతో ప్రక్షాళన చేస్తూ ప్రత్యర్థులను క్రమేణా అణగదొక్కుతున్నారని ఆయన వివరించారు. ఈ రకమైన నియంతృత్వ జాడ్యం తో అమిత అధికార దాహం కలిగిన నాయకుల చేతిలో దేశం ఉందని ఆయన స్పష్టం చేశారు. మోడీ ప్రారంభించిన భీకర మాయా యుద్ధంలో ప్రజలు, కార్మికులు ఆ మాయలో పడకుండా చూడడం సిఐటియు కార్యకర్తగా మనందరి ప్రధాన కర్తవ్యం అని ఆయన పిలుపునిచ్చారు.

స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల మూలంగా ఉపాధి ఉత్పాదకతలు తగ్గుముఖం పడుతున్నాయని తద్వారా దేశంలో కార్మికోద్యమాలు జరగడానికి ప్రతి సిఐటియు కార్యకర్త కర్తవ్యబద్ధుడు కావాలని ఆయన అన్నారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం కోసం రాష్ట్రవ్యాప్తంగా జరిగే ప్రతి కార్యక్రమానికి రాష్ట్ర కమిటీ అందిస్తున్న సహాయ సహకారాలకు ఆయన అభినందించారు. తద్వారా ఈ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్తామని ఆయన అన్నారు.

స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటిదాస్, ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో స్థానిక స్టీల్ యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు తమ ఐక్యతను ప్రకటించాల్సిన సమయం ఆసన్నమైందని వారు స్పష్టం చేశారు. కార్మిక హక్కుల తో పాటు కర్మాగార రక్షణ కూడా మన అందరి ప్రధాన కర్తవ్యం కావాలని వారు పిలుపునిచ్చారు.

సదస్సు అనంతరం కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ లో పనిచేసిన డి.పాండేను ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో నగర సిఐటియు అధ్యక్షులు కె ఎం శ్రీనివాస్ స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ సిఐటియు అధ్యక్షులు జి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నమ్మి రవణ, గౌరవాధ్యక్షులు ఓ వి రావు, స్టీల్ సిఐటియు నాయకులు బి అప్పారావు, టి వి కె రాజు, యు వెంకటేశ్వర్లు, మరిడయ్య వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# హైబిపితో కిడ్నీకి ప్రమాదం



అధిక రక్తపోటు అని పిలువబడే రక్తపోటు మన గుండెపై మాత్రమే కాకుండా మన మొత్తం ఆరోగ్యంపై కూడా గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. ఇది మిలియన్ల మంది ప్రజలను ప్రభావితం చేసే ప్రపంచవ్యాప్త రుగ్మతగా పరిణామం చెందింది మరియు దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధికి ప్రధాన కారణాలలో ఒకటి.

మూత్రపిండాలు శరీరం నుండి వ్యర్థ పదార్థాలను మరియు అదనపు ద్రవాన్ని తొలగించడానికి ముఖ్యమైన అవయవాలు. అధిక రక్తపోటు మూత్రపిండాలలోని పెళుసుగా ఉండే రక్తనాళాలను దెబ్బతీస్తుంది, వాటి పనితీరును దెబ్బతీస్తుంది మరియు వివిధ రకాల తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది.

**మూత్రపిండాల పనితీరు తగ్గడానికి కారణమేమిటి?**

ధమనుల గోడలపై రక్తం యొక్క శక్తి నిరంతరం ఎక్కువగా ఉన్నప్పుడు అధిక రక్తపోటు గుండె మరియు రక్త నాళాలపై ఒత్తిడిని కలిగిస్తుంది. దీనివల్ల రక్తనాళాలు బాగా బిగుతుగా మారతాయి. అధిక రక్తపోటు మూత్రపిండాలను అనేక విధాలుగా దెబ్బతీస్తుంది. కిడ్నీ దెబ్బతినడం అనేది అధిక రక్తపోటు యొక్క అత్యంత సాధారణ దుష్ప్రభావాలలో ఒకటి మరియు తీవ్రమైన సందర్భాల్లో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి మరియు మూత్రపిండాల వైఫల్యానికి దారితీస్తుంది.

**మూత్రపిండ ధమనులు ఎలా దెబ్బతింటాయి?**

మూత్రపిండాలు నెఫ్రాన్స్ అని పిలువబడే చిన్న రక్త నాళాలతో రూపొందించబడ్డాయి, ఇవి రక్తం నుండి వ్యర్థాలు మరియు అదనపు ద్రవాన్ని ఫిల్టర్ చేస్తాయి. అధిక రక్తపోటు కాలక్రమేణా ఈ రక్త నాళాలను దెబ్బతీస్తుంది, మూత్రపిండాలు సరిగ్గా పనిచేయగల సామర్థ్యాన్ని పరిమితం చేస్తుంది. ఇది రక్తంలో వ్యర్థ పదార్థాలను పోగుచేసి మూత్రపిండాలు మరియు ఇతర అవయవాలకు తీవ్రమైన హాని కలిగిస్తుంది.

**మూత్రపిండాల నష్టం యొక్క ప్రారంభ లక్షణాలు**

మూత్రంలోని ప్రోటీన్ హైపర్‌టెన్షన్-ప్రేరిత మూత్రపిండాల నష్టం యొక్క మొదటి సంకేతాలలో ఒకటి. ఇది మూత్రపిండ రక్తనాళాల గాయం వల్ల సంభవిస్తుంది, ఇది ప్రోటీన్ మూత్రం ద్వారా వెళ్ళడానికి అనుమతిస్తుంది. మూత్రపిండ వైఫల్యం తీవ్రతరం కావడంతో, మూత్రపిండాలు రక్తం నుండి వ్యర్థ పదార్థాలను మరియు అదనపు ద్రవాన్ని ఫిల్టర్ చేసే సామర్థ్యాన్ని కోల్పోతాయి, ఫలితంగా శరీరంలో టాక్సిన్స్ పేరుకుపోతాయి.

**అధిక రక్తపోటును నిర్వహించడానికి మార్గాలు**

అధిక రక్తపోటును నిర్వహించడానికి మరియు మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదాన్ని తగ్గించడానికి జీవనశైలి మార్పులు అవసరం. జీవనశైలిలో మార్పులు మరియు మందుల ద్వారా రక్తపోటును నియంత్రించడం మొదటి దశ. ఇది కిడ్నీలోని రక్తనాళాలపై ఒత్తిడిని తగ్గించి, మరింత దెబ్బతినకుండా కాపాడుతుంది.

**మూత్రపిండాలు దెబ్బతినకుండా అధిక రక్తపోటును నిరోధించడంలో సహాయపడే ఇతర జీవనశైలి మార్పులు:** ఉప్పు, కొవ్వు, కొలెస్ట్రాల్ తక్కువగా ఉండే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడం, క్రమం తప్పకుండా శారీరక శ్రమలో పాల్గొనడం, మద్యపానాన్ని నియంత్రించడం, పొగ త్రాగుట మానేయడం.

**మూత్రపిండాల వైఫల్యాన్ని ఎలా నిర్ధారించాలి?**

ఆరోగ్యకరమైన జీవనశైలిని నడిపించడం వల్ల అధిక రక్తపోటు సమస్యలను నివారించవచ్చు. అధిక రక్తపోటు ఉన్నవారు వారి రక్తపోటు మరియు మూత్రపిండాల పనితీరును పర్యవేక్షించడానికి వారి వైద్యుడిని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. మూత్రపిండాల నష్టం గుర్తించినట్లయితే, ప్రారంభ చికిత్స వ్యాధి యొక్క పురోగతిని నెమ్మదిగా లేదా ఆపడానికి సహాయపడుతుంది.

**ఎలా నియంత్రించాలి?**

అధిక రక్తపోటు మూత్రపిండాల ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. అధిక రక్తపోటు వల్ల కలిగే నష్టం మూత్రపిండాలు సక్రమంగా పనిచేసే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది మరియు తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. అయినప్పటికీ, జీవనశైలి మార్పులు మరియు మందుల ద్వారా రక్తపోటును నియంత్రించడం ద్వారా, అధిక రక్తపోటు మూత్రపిండాలు దెబ్బతినకుండా నిరోధించవచ్చు మరియు దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధిని అభివృద్ధి చేసే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. వైద్యునిచే రెగ్యులర్ చెక్-అప్‌లు మూత్రపిండాల నష్టాన్ని ముందుగానే గుర్తించడంలో సహాయపడతాయి, ఇది సత్వర చికిత్సలో సహాయపడుతుంది.

# అతి హాని ... మితి హాయి



అందంగా కనిపించాలని, మెరిసిపోవాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. మహిళలకు ఇంకొద్దిగా ఎక్కువే ఉంటుంది. స్త్రీ, పురుషులు అనే తేడాల్లేకుండా అందంగా కనిపించడానికి చాలా మంది రకరకాల క్రీములు, ఫేస్ వాష్‌లు, సీరమ్‌లు వాడుతుంటారు. అయితే కేవలం క్రీములు రాయడం వల్ల ముఖం కాంతివంతంగా మారదు. పుష్కలంగా నీరు తాగడం, సరైన ఆహారం తినడం, చర్మ సంరక్షణ పాటించడం వల్ల మాత్రమే అందం సొంతం అవుతుంది.

అయితే కొన్ని రకాల ఆహార పదార్థాలు తినడం వల్ల అవి శరీరంపై ప్రభావం చూపి చర్మాన్ని కాంతిహీనంగా మారుస్తాయి. చర్మం పొడిబారడం, మచ్చలు ఏర్పడతాయి. అసలు ఎలాంటి ఆహారాలు తీసుకోవడం వల్ల చర్మం పాడవుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.

**అధిక గ్లైసెమిక్ ఇండెక్స్:** అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న ఆహారాలు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి. దాని వల్ల వాపు వస్తుంది. ఇది చర్మాన్ని దెబ్బతీస్తుంది. వైట్ బ్రెడ్, వైట్ రైస్, చక్కెర పానీయాల్లో అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది.

**ప్రాసెస్డ్ ఫుడ్స్:** ప్రాసెస్డ్ ఫుడ్స్ లో సోడియం సహా అనారోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. వీటి వల్ల చర్మంపై మొటిమలు వస్తాయి. ఇతర చర్మ సమస్యలు తలెత్తుతాయి.

**ఫ్రైడ్ ఫుడ్స్:** వేయించిన ఆహారాల్లో అనారోగ్యకరమైన కొవ్వులు ఎక్కువగా ఉంటాయి. ఈ కొవ్వులు ఇన్‌ఫ్లమేషన్‌కు కారణం అవుతాయి. ఇతర చర్మ సమస్యలు కూడా వస్తాయి.

**చక్కెర పానీయాలు:** చక్కెర పానీయాల్లో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. పోషకాలు తక్కువగా ఉంటాయి. ఇది ఇన్‌ఫ్లమేషన్‌కు కారణం అవుతాయి. దీని వల్ల చర్మంపై మొటిమలు వస్తాయి. అలాగే ఇతర సమస్యలూ తలెత్తుతాయి.

**కెఫిన్:** కెఫిన్ చర్మాన్ని డీహైడ్రేషన్ కు గురిచేస్తుంది. దీని వల్ల చర్మం పొడిబారి, కాంతిహీనంగా మారుతుంది. టీ, కాఫీలు తగ్గడాన్ని పరిమితం చేయాలి. పుష్కలంగా నీరు తాగాలి.

**ఉప్పు:** ఉప్పు ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరం డీహైడ్రేషన్ కు గురవుతుంది. శరీరం డీహైడ్రేషన్ కు గిరి కావడం వల్ల చర్మం పొడిబారుతుంది. ఇతర ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయి. అందుకే ఉప్పును మోతాదుకు మించి తీసుకోవద్దు.

**ఆరోగ్యకరమైన చర్మం కోసం ఏం తినాలి?**

**నీరు:** శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుకోవడం చాలా అవసరం. దీని వల్ల చర్మం పొడిబారకుండా ఉంటుంది. చర్మం తేమ వల్ల కాంతివతంగా కనిపిస్తుంది. అందుకే రోజూ పుష్కలంగా నీరు తాగాలి.

**పండ్లు, కూరగాయలు:** పండ్లు, కూరగయలు యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. ఇది చర్మాన్ని దెబ్బతినకుండా కాపాడుతుంది. రోజుకు కనీస మొత్తంలో తాజా పండ్లు, కూరగాయలు తినాలి. సీజనల్ ఫ్రూట్స్, వెజిటెబుల్స్ తినడం వల్ల అవసరమైన పోషకాలు అందుతాయి.

**తృణధాన్యాలు:** తృణధాన్యాల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. ఇది వాపును తగ్గించడానికి, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతుంది.

**లీన్ ప్రోటీన్:** కణజాలాన్ని నిర్మించడానికి, మరమ్మతు చేయడానికి లీన్ ప్రోటీన్ చాలా కీలకం. ఇది వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. చికెన్, చేపలు, బీన్స్‌లో లీన్ ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది.

# బొప్పాయిని ఎవరు తినకూడదు ?



బొప్పాయి ఆరోగ్యపరంగా చాలా అద్భుతమైంది. బరువు తగ్గించేందుకు చాలామంది బొప్పాయిని డైట్‌లో భాగంగా చేసుకుంటారు. ఇందులో ఉండే విటమిన్ ఎ, విటమిన్ సి, ప్రోటీన్లు, కాల్షియం, ఫాస్ఫరస్, ఐరన్ వంటి పోషకాలు శరీర నిర్మాణంలో ఉపయోగపడతాయి. ఇన్ని పోషక విలువలున్న బొప్పాయి ఎవరికి మంచిది కాదు..

వైద్య నిపుణుల ప్రకారం ఇంత పెద్దమొత్తంలో పోషక విలువలు ఉన్నా కొంతమందికి ఆరోగ్యపరంగా మంచిది కాదు. ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపిస్తుంది. వాస్తవానికి రోగ నిరోధక శక్తి పెంచేందుకు, జీర్ణ వ్యవస్థకు, గుండె ఆరోగ్యానికి బొప్పాయి చాలా ప్రయోజనకరం. కానీ కొంతమంది మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ బొప్పాయి తినకూడదు.

బొప్పాయిలో విటమిన్ సి పెద్దమొత్తంలో ఉంటుంది. బొప్పాయి ఎక్కువగా తినడం వల్ల కిడ్నీలో రాళ్ల సమస్య మరింతగా పెరుగుతుంది. ఎందుకంటే బొప్పాయి ఎక్కువగా తినడం వల్ల కాల్షియం అక్సలేట్ పరిస్థితి ఉత్పన్నమౌతుంది. ఇది కిడ్నీలో రాళ్ల పరిమాణాన్ని పెంచుతుంది. అందుకే కిడ్నీలో రాళ్లతో బాధపడే వారు బొప్పాయికి దూరంగా ఉంటే మంచిది.

ప్రెగ్నెన్సీ మహిళలు బొప్పాయి తినడం ఆరోగ్యపరంగా మంచిది కాదు. ఎందుకంటే ఇందులో ఉండే లేటెక్స్ గర్భాశయాన్ని సంకోచించేలా చేస్తుంది. అందుకే గర్భిణీ స్త్రీలు పొరపాటున కూడా బొప్పాయి తినకూడదు.

మధుమేహం వ్యాధిగ్రస్థులకు బొప్పాయి చాలా మంచిది. కానీ లో షుగర్ అంటే హైపోగ్లైసీమియా రోగులు బొప్పాయి తిన కూడదు. అంటే బ్లడ్ షుగర్ లెవెల్స్ తక్కువగా ఉన్నవాళ్లు బొప్పాయికి దూరంగా ఉండాలి.

బొప్పాయి పండ్లను కొన్ని రకాల మందులతో కలిపి తీసుకోకూడదు. ఎందుకంటే బొప్పాయి గుణం రక్తాన్ని పల్చగా చేస్తుంది. దాంతో శరీరంలో బ్లీడింగ్ సమస్య ఉత్పన్నం కావచ్చు. అంటే బ్లడ్ థిన్నర్ మందులు వేసుకునేవాళ్లు బొప్పాయికి దూరంగా ఉండాలి.

# కాలేయాన్ని కాపాడుకోండిలా ...



గుండె, కిడ్నీల పనితీరు మనిషి ప్రాణాలపై ఏ విధంగా ప్రభావం చూపిస్తుందో లివర్ పనితీరు కూడా అదే రీతిలో ప్రభావం చూపిస్తుంది. ఇటీవలి కాలంలో లివర్ సంబంధిత సమస్యలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. లివర్ అనారోగ్యం అంటే మొత్తం శరీరమే అనారోగ్యమైనట్టు అర్థం.

లివర్ అనేది మనిషి శరీరంలో అతి ముఖ్యమైన అంగం. లివర్ పాడైతే చాలా సమస్యలు వెంటాడవచ్చు. లివర్ పాడవడానికి కారణం కూడా మన ఆహారపు అలవాట్లే. కొన్ని రకాల పదార్ధాలు లివర్‌ను పాడు చేస్తుంటాయి. అందుకే హెల్తీ ఫుడ్ అనేది చాలా ముఖ్యం. ఆరోగ్యంపై శ్రద్ధ వహించకపోతే లివర్ పాడయ్యే అవకాశాలున్నాయి. మనలో చాలామంది బయటి తిండి తినడాన్ని ఇష్టపడుతుంటారు. ఇది మీ ఆరోగ్యానికి హాని కల్గిస్తుంది. లివర్ ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాంటి పదార్థాలు తినకూడదో తెలుసుకుందాం..

ఫాస్ట్ ఫుడ్స్ అనేవి ఆరోగ్యానికి మంచివి కావు. జీర్ణం చేయడంలో ఇబ్బంది ఎదురౌతుంది. అందుకే బర్గర్, పిజ్జా, ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి పదార్ధాలను సాధ్యమైనంతవరకూ దూరం పెట్టడం మంచిది. ఇవి లివర్ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి.

ఇక రెండవది మైదా. మైదాను వైట్ పాయిజన్‌గా పిలుస్తారు. మైదాతో చేసే పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలి. ఇందులో మినరల్స్, ఫైబర్, విటమిన్లు చాలా తక్కువ పరిమాణంలో ఉంటాయి. బ్లడ్ షుగర్ లెవెల్స్‌ను పెంచుతుంది. పాస్తా, పిజ్జా, బ్రెడ్, బిస్కట్ వంటి పదార్థాలన్నీ మైదాతో తయారయ్యేవే. మైదా పదార్థాలు తినడం వల్ల లివర్ దెబ్బతింటుంది.

పంచదార కూడా ఆరోగ్యానికి చాలా హాని కల్గిస్తుంది. స్థూలకాయం పెంచడంతో పాటు లివర్‌ను పాడు చేస్తుంది. అందుకే లివర్ సంబంధిత సమస్యలుంటే తక్షణం మీ డైట్ నుంచి పంచదార లేదా స్వీట్స్ దూరం చేయాలి.

లివర్‌ను పాడుచేసే వాటిలో అతి ముఖ్యమైంది మద్యం. మద్యం నేరుగా లివర్‌పైనే ప్రభావం చూపిస్తుంది. మద్యంకు అలవాటై ప్రాణాలు పోగొట్టుకున్నవారిలో దాదాపు అందరికీ ఒకటే కారణం కన్పిస్తుంది. అది లివర్ డ్యామేజ్ కావడం. మద్యం తరచూ తాగేవారిలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. లివర్ ఆరోగ్యంగా ఉండాలంటే మద్యం అలవాటు మానేయాలి.

# పెరుగుతో మామిడిని కలిపి తింటున్నారా ?



ఎండాకాలంలో పెరుగు తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మంచిది. దీనివల్ల కడుపుకు శరీరానికి చలవ చేస్తుంది. కానీ పెరుగు ఆరోగ్యానికి మంచిదే అయినా కొన్ని రకాల ఆహార పదార్ధాలతో కలిపి తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపిస్తుంది. పెరుగుతో ఎలాంటి కాంబినేషన్ మంచిది కాదో తెలుసుకుందాం..

మనిషి శరీర నిర్మాణంలో ఎముకలు అత్యంత కీలకం. ఎముకలు బలంగా ఉండాలంటే కాల్షియం చాలా అవసరం. పాలు, పెరుగులో కాల్షియం ఎక్కువ పరిమాణంలో ఉంటుంది. పెరుగులో అయితే ప్రోటీన్లు, కాల్షియం, విటమిన్ బి6, విటమిన్ బి12 వంటి పోషకాలు చాలా ఉన్నాయి. ఈ పోషకాలు పుష్కలంగా ఉంటే చాలా రకాల వ్యాధుల్నించి రక్షణ పొంద వచ్చు. కానీ కొన్ని పదార్ధాల కాంబినేషన్ ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు. పెరుగుతో కొన్ని రకాల పదార్ధాలు తినడం వల్ల జీర్ణక్రియ, చర్మ సంబంధిత సమస్యు ఎదుర్కోవల్సి వస్తుంది.

పెరుగుతో చేపలు కలిపి తినడం ఆరోగ్యానికి ఏ మాత్రం మంచిది కాదు. ఈ రెండింట్లోనూ ప్రోటీన్లు అధికంగా ఉండటం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తవచ్చు. అందుకే చేపలు, పెరుగు కలిపి తినకూడదంటారు.

ఆయిలీ పదార్థాలైనా పూరీ, ఛోలే భటూరేలతో చాలామంది పెరుగు తీసుకోవడం చూస్తుంటాం. కానీ పెరుగుతో ఈ కాంబినేషన్ మంచిది కాదు. దీనివల్ల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపిస్తుంది. దాంతోపాటు జీర్ణ సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. ఆయిలీ ఫుడ్స్‌తో పొరపాటున కూడా పెరుగు తినడం మంచి అలవాటు కాదు.

ఇక అన్నింటికంటే ముఖ్యమైంది పాలు పెరుగు కాంబినేషన్. ఇది ఏ మాత్రం మంచిది కాదని చాలాకాలంగా తెలుసు. పాలు పెరుగు కలిపి తీసుకుంటే గ్యాస్, ఛాతీలో మంట, కడుపు ఉబ్బరంగా ఉండటం వంచి సమస్యలు తలెత్తవచ్చు. పాలు, పెరుగు రెండింట్లోనూ ప్రోటీన్లు అధికంగా ఉండటం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు ఉత్పన్నం కావచ్చు.

పెరుగు తినేటప్పుడు పుల్లటి పండ్లను పొరపాటున కూడా తినకూడదు. ఇది ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. పెరుగన్నంతో పాటు ఆరెంజ్, స్ట్రాబెర్రీ, నిమ్మ వంటివి తింటే కచ్చితంగా జీర్ణ సంబంధిత సమస్యలు రావచ్చు.

చాలామంది పెరుగన్నంలో మామిడి పండ్లు తింటుంటారు. సాధారణంగా ఎక్కువగా కన్పించే కాంబినేషన్ ఇది. మామిడి స్వభావం వేడి, పెరుగు చలవ చేసే స్వభావం కలిగి ఉంటాయి. ఈ రెండూ కలిపి తినడం వల్ల శరీరంలో టాక్సిన్స్ ఉత్పత్తి అవుతాయి. దాంతోపాటు చర్మ సంబందిత సమస్యలు తలెత్తుతాయి.

# తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష



ఆరు నెలల వరకు బిడ్డకు తల్లి పాలు ఎంత ముఖ్యమో తెలుసా? శిశువుల పోషకాహారం ఉత్తమ రూపం తల్లి పాలు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి, బిడ్డ ఇద్దరికీ చాలా ప్రయోజనాలు ఉన్నాయి. బిడ్డకు పాలివ్వడం వల్ల క్యాన్సర్ బారిన పడకుండా కాపాడుకోవచ్చునని ఓ అధ్యయనం చెబుతోంది.

క్యాన్సర్‌కు వ్యతిరేకంగా తల్లిపాలను రక్షించే ప్రభావాన్ని వివరించడానికి అనేక అధ్యయనాలు ప్రతిపాదించారు. తల్లి పాలలో యాంటీబాడీస్, ఎంజైమ్‌లు, రోగనిరోధక కణాలతో సహా అనేక రకాల ప్రయోజనకరమైన భాగాలు ఉన్నాయి. ఇది శిశువు రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. ఇన్ఫెక్షన్లు,వాపులను నివారించడానికి సహాయపడుతుంది.

తల్లిపాలను, చిన్ననాటి లుకేమియా ప్రమాదానికి మధ్య ఉన్న సంబంధాన్ని పరిశీలించింది. 18,000 కంటే ఎక్కువ మంది పిల్లల నుండి డేటాను విశ్లేషించిన అధ్యయనం, తల్లిపాలు లేదా తక్కువ కాలం పాటు తల్లిపాలు ఇవ్వని వారితో పోలిస్తే కనీసం ఆరు నెలల పాటు తల్లిపాలు తాగిన వారికి లుకేమియా వచ్చే ప్రమాదం గణనీయంగా తక్కువగా ఉందని కనుగొన్నారు.

**న్యూరోబ్లాస్టోమా ప్రమాదాన్ని తగ్గిస్తుంది:** తల్లిపాలను, న్యూరోబ్లాస్టోమా అనే సాధారణ బాల్య క్యాన్సర్ ప్రమాదానికి మధ్య ఉన్న సంబంధాన్ని అన్వేషించింది. ఎక్కువ కాలం తల్లిపాలు ఇవ్వడం వల్ల న్యూరోబ్లాస్టోమా వచ్చే ప్రమాదం తగ్గుతుందని పరిశోధకులు కనుగొన్నారు. ఎక్కువ కాలం తల్లిపాలు ఇవ్వడంతో రక్షణ ప్రభావం పెరుగుతుంది.

**HMOలు క్యాన్సర్ ప్రమాదాన్ని నిరోధించవచ్చు:** తల్లి పాలలో మానవ పాలు ఒలిగోశాకరైడ్స్ వంటి బయోయాక్టివ్ పదార్థాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో క్యాన్సర్ నిరోధక గుణాలు ఉన్నట్లు గుర్తించారు. అదనంగా, తల్లిపాలు క్యాన్సర్ నివారణ కంటే అనేక ప్రయోజనాలను అందిస్తుంది. మొదటిది, తల్లి పాలలో పెరుగుతున్న శిశువు నిర్దిష్ట అవసరాలను తీర్చడానికి అవసరమైన పోషకాలు ఉంటాయి. ఆరోగ్యకరమైన పెరుగుదలను ప్రోత్సహిస్తుంది.

**తల్లిపాలు అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది:** ఇది శ్వాసకోశ, జీర్ణశయాంతర వ్యాధుల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. ఆకస్మిక శిశు మరణ సింద్రోమ్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. తరువాత జీవితంలో అలర్జీలు, ఆస్తమా, ఊబకాయం వచ్చే అవకాశాలను తగ్గిస్తుంది. తల్లిపాలు తల్లి, బిడ్డ ఇద్దరికీ అనేక ప్రయోజనాలను అందిస్తాయి.

## పరగడుపునే ఉల్లిపాయ రసం



డయాబెటిస్.. ఇది ప్రపంచ వ్యాప్తంగా చాపకింద నీరులా వ్యాపిస్తోంది. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా అందరికి వెంటాడుతోంది. దేశంలో ప్రతి ఒక్కరి ఇంట్లో డయాబెటిస్ పేషెంట్లు ఉంటున్నారంటే ఏ మేరకు వ్యాపిస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఇది రావడానికి వివిధ కారణాలు ఉన్నాయి. కుటుంబ చరిత్ర కారణంగా, టెన్షన్, సమయానికి భోజనం చేయకపోవడం తదితర కారణాల వల్ల అందరికి వ్యాపిస్తోంది. ఒక్కసారి మధుమేహం వ్యాధి వచ్చిందంటే చాలు జీవన శైలిని మార్చుకుని అదుపులో పెట్టుకోవాలి తప్ప.. పూర్తిగా నయం చేసుకోలేము.

టైప్-1 లేదా టైప్-2 డయాబెటిస్ చాలా మందికి వస్తోంది. అయితే ఏ రకమైన డయాబెటిస్ అయినా దాన్ని కేవలం ఒక్క ఉల్లిపాయతో నియంత్రించవచ్చట. పచ్చి ఉల్లిగడ్డ ప్రతిరోజా 50 గ్రాముల మోతాదులో తింటే షుగర్ కంట్రోల్ అవుతుందని శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనల్లో వెల్లడైంది. ఉల్లిగడ్డలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఉల్లిగడ్డ తినడం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. దీనిని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ సమస్య కూడా తగ్గి, హార్ట్ స్ట్రోక్ ప్రమాదాలు తగ్గుతాయని పరిశోధకులు చెబుతున్నారు. ఉల్లిలో క్రోమియం ఎక్కువగా ఉండటం వల్ల షుగర్ లెవల్స్‌ను అదుపులో ఉంచేందుకు ఉపయోగపడుతుంది. ఉల్లిపాయను 7 రోజుల పాటు క్రమం తప్పకుండా తింటే అద్భుతమైన ఫలితాలు పొందవచ్చని వెల్లడిస్తున్నారు.

మధుమేహంతో పోరాడడంలో ఉల్లిపాయ కీలక పాత్ర పోషిస్తుంది. ఇది రక్తంలో చక్కెరను నియంత్రించగల పదార్థాన్ని కలిగి ఉంటుంది.

ఉల్లిపాయ రసం ఇతర ప్రయోజనాలను కూడా కలిగి ఉంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రోగులు తప్పనిసరిగా ఉల్లిపాయ రసంతో తమ రోజును ప్రారంభించాలి. ఇది జీర్ణవ్యవస్థను, రక్తంలో చక్కెరను ఏకకాలంలో మెరుగుపరుస్తుంది.

అలాగే జుట్టు ఆరోగ్యానికి కూడా ఉల్లిపాయలు మేలు చేస్తాయి. జుట్టు పెరుగుదలకు మేలు చేసే సల్ఫర్ ఇందులో ఉంటుంది. ఉల్లిపాయ రసాన్ని వారానికి రెండు రోజులు కూడా మీ జుట్టు మరియు తలకు పట్టిస్తే, మీ జుట్టు నాణ్యత మెరుగుపడే అవకాశం ఉంది.

# బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా సరస్వతి



**భద్రాద్రికొత్తగూడెం, వెలుగు:** బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా చిర్రా సరస్వతిని నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ తెలిపారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని పార్టీ జిల్లా ఆఫీస్‌లో జరిగిన ప్రోగ్రాంలో సరస్వతికి నియామక పత్రాన్ని ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం కృషి చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

రాష్ట్రపతి పదవిని మహిళలకు కట్టబెట్టిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని ఆరోపించారు. ఈ ప్రోగ్రాంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి శ్రీనివాసరావు, ఓబీసీ జిల్లా మోర్చా అధ్యక్షుడు అకుల నాగేశ్వరరావు, కిసాన్? మోర్చా జిల్లా అధ్యక్షుడు కోనేరు నాగేశ్వరరావు, లీడర్లు సుచిత్ర పాసి, పెద్దబోయిన సునీత, సుమలత పాల్గొన్నారు.

# పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



**విజయనగరం:** పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి గణపతి రావు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

బుధవారం ఉదయం ఆయన హంబెర్ లో పదో తరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో వచ్చేనెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరగనున్న టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 33 కేంద్రాల్లో 5610 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, పరీక్షల నిర్వహణకు ఎక్కడా ఇబ్బంది లేకుండా అన్ని శాఖల అధికారులు తమకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ పరీక్షల తనిఖీల కోసం 3 ఫ్లైయింగ్ స్కాడ్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు భద్రత ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు ఉండేలా అప్రమత్తంగా ఉండాలన్నారు.

# ఎన్టిపిసి సింహాద్రి కి సేఫ్టీ అవార్డు




**పరవాడ, (విశాఖ సమాచారమ్):** మే 29న న్యూఢిల్లీలోని హొటల్-లే మెరిడియన్‌లో జరిగిన కార్యక్రమంలో గ్రీన్‌టెక్ ఫౌండేషన్ ద్వారా ఎన్‌టీపీసీ సింహాద్రికి 'సేఫ్టీ ఎక్సలెన్స్' విభాగంలో అవార్డు లభించింది. ఈ అవార్డును భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా అందజేశారు. ఎన్టీపీసీ సింహాద్రి తరపున డీజీఎం పి సదాశివ రెడ్డి, అవార్డును అందుకున్నారు.

# శ్రీ క్షేత్రమ్‌లో వైభవంగా శ్రీనివాస కళ్యాణం



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** ప్రముఖ భారతీయ తత్త్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రమ్‌లో కొలువైయున్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా శ్రీనివాస కళ్యాణం నిర్వహించారు. బుధవారం ఉదయం దేవాలయం అర్చకులు చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు వేద మంత్రాల నడుమ వేంకటేశ్వరస్వామికి కళ్యాణం గావించారు. అనంతరం ప్రపంచ శాంతిని కోరుతూ సుదర్శన హోమం గావించారు. ఈ ఉత్సవంలో దేవాలయం ధర్మకర్త దుర్గా బాలాజీ, ఉమాదేవి దంపతులు, నీరజ మన్నే, భక్తులు పాల్గొన్నారు.

# వైసీపీకి ఎమ్మెల్యేల గెలుపుకు సాయం చేస్తున్నది ఆ టీడీపీ మాజీ మంత్రి



ఏపీలో వైసీపీ, టీడీపీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో టీడీపీకి చెందిన ఓ మాజీ మంత్రి తన జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యేల గెలుపుకు సాయం చేస్తే..? ఆ ఊహ కూడా కష్టమే. కానీ అధికార పార్టీకి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే మాత్రం ఇదే నిజం అంటున్నారు. అంతే కాదు సదరు మాజీ మంత్రి ఎక్కడెక్కడ ఎలా సాయం చేస్తున్నాడో కూడా ఇవాళ వివరిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

టీడీపీ ప్రభావం ఎక్కువగా ఉండే ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీ గత ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెల్చుకుంది. మరోసారి ఇదే ఫీట్ రిపీట్ చేయాలని పట్టుదలగా ఉంది. ఇందుకోసం వైసీపీ పడే కష్టం పడుతుందో లేదో తెలియదు కానీ టీడీపీకి చెందిన మాజీ మంత్రి దేవినేని ఉమ మాత్రం బాగా కష్టపడుతున్నారట. ఈ విషయం చెప్పింది మరెవరో కాదు గతంలో మంత్రిగా ఉన్న దేవినేని ఉమను ఆయన సొంత నియోజకవర్గం మైలవరంలో భారీ మెజారిటీతో ఓడించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్.

మాజీ మంత్రి దేవినేని ఉమ పై ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ ఇవాళ ఘాటు విమర్శలు చేశారు. తెలంగాణ మంత్రి మల్లారెడ్డి తనకు ఇన్స్పిరేషన్ అంటూ వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక్కసారి గెలిచిన కృష్ణ ప్రసాద్ కు అంత బలుపా అని ఉమా మాట్లాడుతున్నాడని వసంత పేర్కొన్నారు. అవును వసంత కృష్ణ ప్రసాద్ కు బలుపే అన్నారు.

నువ్వు నాలుగు సార్లు గెలిచినా.. నీ గెలుపు ఎటువంటి గెలుపో చెప్పాలని ప్రశ్నించారు. తనది అన్న వదినల బలిదానంతో నువ్వు గెలిచిన గెలుపు లాంటిది కాదని దేవినేని ఉమపై వసంత తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

2019లో మంత్రి గా ఉన్న నిన్ను 13000 వేల మెజారిటీ తో గెలిచిన గెలుపు అసలైన గెలుపంటూ దేవినేనిని ఉద్దేశించి వసంత కృష్ణప్రసాద్ వ్యాఖ్యానించారు. తెలంగాణ మంత్రి మల్లారెడ్డి చెప్పినట్లు తాను కూడా ప్లాట్లు అమ్మానని, భూములు అమ్మానని, అపార్ట్ మెంట్ కట్టి అమ్మి ఇంత ఎదిగానని కృష్ణ ప్రసాద్ తెలిపారు. దేవినేని ఉమా ఏం వ్యాపారం చేశావో చెప్పాలన్నారు.

దేవినేని కుటుంబం నందిగామ, మైలవరం నియోజకవర్గానికి చెందిన వారు కాదని, గన్నవరం నియోజకవర్గానికి చెందిన దేవినేని కుటుంబం కంచికచర్ల లో కూల్ డ్రింక్స్ పెట్టుకుని బ్రతికారన్నారు. అలాంటి కుటుంబం నుంచి వచ్చిన ఉమ ఎమ్మెల్యేగా ఐదుసార్లు ఎలా పోటీచేశారన్నారు.

మంత్రి మల్లారెడ్డిలాగా పూలు అమ్మావా పాలు అమ్మావా చెప్పాలని దేవినేని ఉమను కృష్ణ ప్రసాద్ ప్రశ్నించారు. ఇసుక, మట్టి, అమ్ముకోవడం తప్ప నువ్వు ఏ వ్యాపారం చేశావో చెప్పాలన్నారు. దేవినేని ఉమ వైసీపీ పార్టీకి అనుకూల శత్రువన్నారు.

దేవినేని ఉమ లాంటి నాయకుడు ఉండబట్టే కృష్ణాజిల్లా తెలుగు దేశం పార్టీ కకావికలం అయ్యిందని వసంత తెలిపారు. కొడాలి నాని, వల్లభనేని వంశీ,ఇతర టీడీపీ నాయకులకు టీడీపి వీడి వైసీపీలోకి రావడానికి కారణం దేవినేని ఉమే అన్నారు. టీడీపీలో ఉన్న క్రియాశీలక నాయకులు పనిచేయకపోవడానికి కారణం దేవినేని ఉమా అని ఆరోపించారు. నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు మళ్ళీ ఎమ్మెల్యే కావాలన్నా దేవినేని ఉమ సపోర్ట్ కావాలన్నారు. దేవినేని ఉమ నియోజక వర్గానికి వచ్చి వెళ్ళినప్పుడల్లా 500 టీడీపీ ఓట్లు పోవడం ఖాయమని వసంత తెలిపారు.

# భారత్‌లో కలిసేందుకు పాక్ ప్రజలు రెడీ



భారత్ చిరకాల ప్రత్యర్థి, పొరుగుదేశం పాకిస్తాన్ పై యూపీ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ మరోసారి విమర్శల వర్షం కురిపించారు. పాకిస్తాన్ తీవ్రవాదం, ఆర్థిక పరిస్థితి, పీవోకే ల ప్రజల ఆకాంక్షలపై యోగీ తనదైన శైలిలో వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ లో ప్రజలు భారత్ లో కలవాలనుకుంటున్నట్లు యోగీ వెల్లడించారు. తాజాగా అక్కడ చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో యోగీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

భారత్ లో తొమ్మిదేళ్ల నరేంద్రమోడీ పాలన గురించి మాట్లాడిన యోగీ ఆదిత్యనాథ్ ఈ తొమ్మిదేళ్లలో సరిహద్దుల్ని కేంద్రం పటిష్టం చేసిందని వెల్లడించారు. ముఖ్యంగా చైనా, పాకిస్తాన్ నుంచి పొంచి ఉన్న ముప్పు నేపథ్యంలో కేంద్రం చేపట్టిన చర్యల్ని యోగీ ప్రశంసించారు. అలాగే పొరుగున ఉన్న పాకిస్తాన్ నానాటికీ అప్పుల్లో కూరుకుపోతోందన్నారు. అలాగే పీవోకేలో పరిస్థితుల్ని కూడా యోగీ ప్రస్తావించారు.

పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే)లో నివసిస్తున్న ప్రజలు భారత్‌లో భాగం కావాలనే తమ కోరికను వ్యక్తం చేస్తున్నారని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. పీఓకే వాసులు భారత్‌లో చేరేందుకు తమ మద్దతును ప్రకటించడం ప్రారంభించారని ఆయన పేర్కొన్నారు. భారతదేశంతో కలిసిపోవాలనుకునే పీఓకే నివాసులలో పెరుగుతున్న సెంటిమెంట్‌ను గుర్తుచేస్తూ యోగీ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఇప్పటికే రాజకీయంగా పాకిస్తాన్ ప్రభుత్వం, ఆర్మీతో విభేదిస్తున్న పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రజలు భారత్‌లో కలిసేందుకు మొగ్గు చూపుతున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ దిశలో కొంతకాలంగా నిరసనలు కూడా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే యోగీ ఆదిత్యనాథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆదిత్యనాథ్ వ్యాఖ్యలు తమ రాజకీయ స్థితిని మార్చాలని, భారతదేశంలో భాగం కావడానికి మొగ్గు చూపుతున్న పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రజల ఆకాంక్షకు మద్దతుగా నిలుస్తున్నాయి.

# జాతీయ పొగాకు నిర్మూలన దినోత్సవం




**పరవాడ, (విశాఖ సమాచారమ్):** జాతీయ పొగాకు నిర్మూలన దినోత్సవం సందర్భంగా పరవాడ పీహెచ్సీ లో డాక్టర్ రంజిత్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధూమపానం చేయడం వల్ల గుండె జబ్బులు, ఊపిరితిత్తుల రోగాలు క్యాన్సర్ వ్యాధులు, వస్తానని అన్నారు. ప్రతి ఒక్కరూ ధూమపానానికి, ఖైని, గుట్కా వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

# అన్యాయం చేశారంటున్న గిరిజనులు - కోర్టులో తేల్చుకోమంటున్న అధికారులు

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన 'జగనన్న భూ రీ-సర్వే'తో సాగులో లేనివారికి పట్టాలు ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.**

జగనన్న భూముల రీ-సర్వేలో తమ పేర్లు రికార్డుల్లో కనిపించకుండా చేశారని, తరాలుగా సాగులో ఉన్న తమకు అన్యాయం చేసి గిరిజనేతరులకు పట్టాలు ఇచ్చారంటూ అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం పనసలపాడు గ్రామ గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**'భూముల రీ-సర్వే తర్వాతే తెలిసింది'**

రోలుగుంట మండలంలోని రత్నంపేట పంచాయతీ పనసలపాడు గిరిజన గ్రామంలో 12 కుటుంబాలు తరాలుగా గ్రామంలోని భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి.

ఈ గ్రామంలో 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం' పేరుతో అధికారులు నిరుడు అక్టోబర్, నవంబర్ మధ్య కాలంలో సర్వే జరిపారు.

దీనినే 'జగనన్న భూముల రీ-సర్వే' అని పిలుస్తున్నారు. దీనికి సంబంధించిన ప్రక్రియ పూర్తయిన తరువాత ఈ ఏడాది ఏప్రిల్‌లో పాస్ పుస్తకాలు ఇవ్వడం మొదలుపెట్టారు.

తమకు పాస్ పుస్తకాలు వస్తాయని ఆశించిన గిరిజనులకు నిరాశే ఎదురైంది. పనసలపాడులో నివాసమంటున్న 12 గిరిజన కుటుంబాలకు కాకుండా, ఆ భూములకు సంబంధించిన పాస్ పుస్తకాలను గిరిజనేతరులకు ఇచ్చారని వారికి తెలిసింది.

దాంతో, వారు అధికారుల చుట్టూ తిరగడం ప్రారంభించారు.

'భగత తెగకు చెందిన మేం పూర్వం నుంచి వంశపారంపర్యంగా పనసలపాడు గ్రామంలోనే ఉంటూ దాదాపు 20 ఎకరాల భూమిని సాగు చేస్తున్నాం. మా గ్రామంలో భూముల రీ-సర్వే జరిపారు. దీంతో మాకు పట్టాలు వస్తాయని ఆశపడ్డాం. కానీ తీరా చూస్తే సాగు చేస్తున్న మాకు కాకుండా, గిరిజనేతులకు పట్టాలు ఇచ్చారు. అంటే రీ-సర్వే పేరుతో మమ్మల్ని సాగుకు, భూమికి దూరంగా చేశారు. రికార్డ్స్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్) ఇన్ ల్యాండ్ అండ్ పట్టాదార్ పాస్ బుక్ యాక్ట్ చట్టం ప్రకారం, సాగులో లేని వారికి పట్టాలు ఎలా ఇస్తారు?" అని పనసలపాడు గ్రామానికి చెందిన గిరిజనుడు గెమ్మిలి చినబ్బాయ్ ప్రశ్నించారు.

**'వివాదం ఈ సర్వే నెంబర్లలోనే...'**

పనసపాడు గ్రామంలో 6/1, 6/9, 8/1 సర్వే నెంబర్లలో ఉన్న భూములు తమ అధీనంలో ఉన్నాయని పనసలపాడు గిరిజనులు చెప్తున్నారు. ఈ భూముల్ని వారే సాగు చేస్తున్నారు.

జగనన్న భూముల రీ-సర్వే చేసిన తర్వాత వీటికి గిరిజనేతరుల పేరుతో పాస్ పుస్తకాలు ఇచ్చారు. దీంతో, ప్రభుత్వం చేస్తున్న రీ సర్వేలో గిరిజనేతరులకు పట్టాలు ఎలా ఇస్తున్నారంటూ గిరిజనులు ఆందోళనకు దిగారు.

"6/9 సర్వే నెంబరులో గెమ్మిలి మల్లుదొర కుటుంబీకుల పేరుతో 4 ఎకరాలుకు పైగా భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు ఉన్నాయి. రికార్డుల్లో మా పేర్లు స్పష్టంగా ఉన్నాయి. కానీ రీ-సర్వే తర్వాత పాస్ పుస్తకాలను మాత్రం మాజీ సర్పంచ్ తమటాపు సత్యనారాయణ పేరుతో ఇచ్చేశారు. మా పేరుతో భూముల రికార్డులు ఉంటే, ఆయన పేరుతో పాసు పుస్తకాలు ఎలా ఇచ్చారు? ఈ భూముల విషయంలో మేం ఎవరితోనూ, ఎప్పుడూ ఎటువంటి రాతకోతలు చేయలేదు" అని పనసలపాడుకు చెందిన గిరిజనుడు గెమ్మిలి చినబ్బాయ్ బీబీసీతో చెప్పారు.

"8/1 సర్వే నెంబరులోని రెవెన్యూ రికార్డుల్లో గెమ్మిలి సింగన్నదొర పేరుతో ఉన్న భూములను రీ-సర్వే తర్వాత



గిరిజనేతరుడు ఆర్లి సోమరాజు పేరుతో 1.16 సెంట్లు భూమిని అసైన్‌మెంట్ భూమిగా చూపిస్తున్నాయి. రికార్డుల ప్రకారం హక్కుదారుడు గెమ్మిలి సింగన్న దొర. కానీ పాస్ బుక్ మాత్రం ఆర్లి సోమరాజు పేరుతోనే ఇచ్చారు. హక్కుదారులైన గిరిజనులకు కాకుండా గిరిజనేతరులకు ఎలా పాస్ పుస్తకాలు ఇచ్చారు?" అని గెమ్మిలి సింగన్నదొర ఆవేదన వ్యక్తం చేశారు.

**'రికార్డులున్నా, సాగులో ఉన్నా%ౌ%పాస్ పుస్తకాలు ఇవ్వలేదు'**

రికార్డుల్లో ఉన్న భూమి, సాగులో ఉన్న భూమిని కూడా గిరిజనేతరుల పేరుతోనే పాస్ పుస్తకాలు అధికారులు ఇచ్చారని గిరిజనులు ఆరోపిస్తున్నారు .

6/1 సర్వేలో గెమ్మిలి కుటుంబాలకు చెందిన 10 మంది సాగులో ఉన్నారు. ఇక్కడ గిరిజన కుటుంబీలకు ఉన్న 4 ఎకరాకలు పైగా భూమిని గిరిజనేతరురాలైన భగవతి మైథిలికుమారి పేరుతో పాస్ పుస్తకాలు ఇచ్చారు.

ఇక్కడ సాగులో ఉన్నా కూడా తనకు పాస్ పుస్తకం రాలేదని గెమ్మిలి నూకినాయుడు తెలిపారు.

ఇలా రికార్డుల్లో ఉన్నా, సాగులో ఉన్న గిరిజనులకు జగనన్న భూ రీ-సర్వేలో పట్టాదారు పాస్ పుస్తకాలు రాలేదనే విషయంలో గెమ్మిలి నూకినాయుడు, గెమ్మిలి సింగన్నదొర, గెమ్మిలి చిన్నబ్బాయ్ విషయాల్లో తేలింది.

ఇలా పనసలపాడులో నివాసముంటున్న 12 గిరిజన కుటుంబాలకు ఇదే జరిగింది. దీంతో, జగనన్న రీ సర్వేలో తమకు అన్యాయం జరిగిందని, అధికారులు గిరిజనేతరులకు వత్తాసు పలుకుతున్నారని గిరిజనులు ఆరోపించారు.

తక్షణమే వీటిని రద్దుచేసి అర్హులైన సాగుదారులకు పట్టాలు మంజూరు చేయాలని పనసలపాడు గ్రామానికి చెందిన గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

**'రీ-సర్వేతో తారుమారైన రికార్డులు'**

జగనన్న భూముల రీ-సర్వే ముందు వరకు రికార్డులు సరిగానే ఉన్నాయని, ఈ సర్వే పేరుతో అధికారులు గిరిజనేతరులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని గిరిజన సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

"అనకాపల్లి జిల్లా కలెక్టర్ పనసలపాడు గ్రామానికి వచ్చి సెక్షన్ 9(2) ప్రకారం సర్వే చేసి, దానిపై రైతుల అభిప్రాయాలు తీసుకొని డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ (డీఎల్ఆర్) నమోదు చేయాలి. ఈ పద్ధతి పనసలపాడు రెవెన్యూ పరిధిలో జరగలేదు. సర్వే నెంబర్లు 6/1, 6/9, 8/1 సర్వే నెంబరులో భూములకు గిరిజనులు పట్టాదారులుగా, సాగు హక్కుదారులుగా ఉన్నప్పటికీ... భూముల రీ-సర్వే తర్వాత పట్టాదారు పాస్ పుస్తకాలు గిరిజనేతరులకి ఎలా ఇస్తారు?" అని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ అధ్యక్షులు కొరువాడ గోవిందరావు బీబీసీతో అన్నారు.

"భూముల రీ-సర్వే నిబంధల ప్రకారం జరపలేదు. రీ సర్వేలో భాగంగా గ్రామసభ రెవెన్యూ గ్రామంలో నిర్వహించాలి. దానికి నోటీసులు ఇవ్వాలి. అదేమీ లేకుండా అసలు గిరిజనులకు భూముల రీ-సర్వేపై అవగాహన కల్పించకుండా ఎక్కడో మారుమూల గ్రామంలో నిర్వహించి గ్రామసభ అయిందనిపించారు. ఈ సర్వేకు ఆధారమైన సెటిల్ మెంట్ రికార్డులు, డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ లో గిరిజనులు పేర్లు ఉన్నా కూడా, రీ సర్వేలో ఆ పేర్లు తారుమారైపోయాయని, ఇది అధికారులు గిరిజనులకు చేసిన అన్యాయం" అని కొరువాడ గోవిందరావు అన్నారు.

**'వివాదస్పద భూములుగా మార్చిన అధికారులు'**

జగనన్న రీ-సర్వేలో గిరిజనులకు ఎటువంటి అన్యాయం జరగలేదని రెవెన్యూ అధికారులు అంటున్నారు.

ఆ భూములు ఎవరి పేరుతో రిజిస్ట్రేషన్లు జరిగాయో, వారికే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చామని రోలుగుంట డిప్యూటీ తహసీల్దార్ హెచ్. త్రివేణీ బీబీసీతో చెప్పారు.

"పనసలపాడులో నివాసముంటూ అక్కడ భూములను సాగు చేస్తున్న గిరిజనులకు రికార్డులు లేవు. సాగులో లేకపోయినా ఆ భూములపై భగవతి మైథిలికుమారి, తమటాపు సత్యనారాయణ వంటివారు 2012లో రిజిస్ట్రేషన్లు కలిగి ఉన్నారు. కాబట్టి వారి పేర్లతో పాస్ పుస్తకాలు ఇచ్చాం. దీనిపై గిరిజనులు అందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఆర్డీవోతో కలిసి గ్రామాన్ని సందర్శించాం. అక్కడ పరిస్థితిని తెలుసుకున్నాం. ఆ తర్వాత ఈ భూములను వివాదస్పద భూములుగా గుర్తించి, ఈ భూములపై అధికారం ఎవరికి లేదని రిపోర్ట్ రాశాం" అని డిప్యూటీ తహసిల్దార్ త్రివేణి చెప్పారు.

ఈ భూములకు రిజిస్ట్రేషన్ అవ్వాలంటే అమ్మకాలు, కొనుగోలు జరగాలి.

కానీ గిరిజనులు సాగులో ఉన్న భూములకు రిజిస్ట్రేషన్లు జరగాలంటే ఆర్వోఆర్ఎఫ్ చట్టం ప్రకారం అది వీలుకాదని గిరిజన సంఘాలు అంటున్నాయి.

**'గిరిజనులు కోర్టుకు వెళ్లాలి'**

జగనన్న రీ-సర్వే తర్వాత వివాదస్పద భూములుగా మారిన పనసలపాడులోని భూములకు పరిష్కారం ఎలా అని రోలుగుంట తహసీల్దార్‌ను బీబీసీ ప్రశ్నించింది.

"రీ-సర్వే తర్వాత పాస్ పుస్తకాలు ఇచ్చిన వాటిపై ఏవైనా వివాదాలు ఉంటే, వాటిని కోర్టులోనే తేల్చుకోవాలి. ఇది మా పరిధిలో లేదు. గిరిజనులు, గిరిజనేతురులైనా తమ వద్ద అధికారిక పత్రాలు ఉంటే వాటిని పట్టుకుని కోర్టులో విషయాన్ని తేల్చుకోవాలి" అని డిప్యూటీ తహిసీల్దార్ త్రివేణి చెప్పారు.

ఇప్పటికే 8/1 సర్వే నెంబరులో భూ వివాదం విషయంలో గత మూడేళ్లుగా కోర్టులో గిరిజనులకు, గిరిజనేతరులకు కేసు నడుస్తోందని పనసలపాడు గిరిజనులు బీబీసీతో చెప్పారు. మళ్లీ తాము కోర్టుకి వెళ్తే తమ జీవితాలకు కోర్టు చుట్టూ తిరగడంతోనే సరిపోతుందని అన్నారు.

"ఏళ్ల తరబడి సాగులోనే కాకుండా హక్కుదారులుగా ఉన్న భూమిని పొందాలంటే మళ్లీ గిరిజనులు కోర్టులకు వెళ్లమనడమంటే దీనిలోనే కుట్ర దాగి ఉంది. ఇది అంత త్వరగా తేలే వ్యవహారం కాదు. పైగా ఖర్చుతో కూడుకున్న పని. వివాదస్పద భూముల కింద మార్చడమంటేనే గిరిజనేతులకు మేలు చేయడం. దీనిపై జాయింట్ కలెక్టర్ స్థాయిలో నిర్ణయం తీసుకుని గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం" అని గిరిజన సంఘం నాయకులు కొమరాడ గోవింద్ బీబీసీతో అన్నారు.

## సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా అన్నదానం



**గాజువాక, (విశాఖ సమాచారమ్):** విశాఖ సిటీ వైడ్ కృష్ణ మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సరస్వతీ పార్క్ విశాఖపట్నం గౌరవ అధ్యక్షులు గాజుల వెంకట్రావు ప్రెసిడెంట్ బీసీ అప్పారావు వైస్ ప్రెసిడెంట్ మన్యాల శ్రీనివాస డైమండ్ పార్క్ ప్రెసిడెంట్ మద్దిశేఖర్ రెడ్డి గీతా పార్లర్ మురళీకృష్ణ ఇంద్ర భాస్కర్ న్యూ కాలనీ చిన్న కె. శ్రీనివాసరావు సహారా ప్రభాకర్ ఎస్కే మదీనా ఫైనాన్ని రెడ్డి జిఎస్ కుమార్ , విజయ్ , జగదాంబ దియాటర్ లో అభిమానుల సమక్షము లో కేక్ కటింగ్ చేసారు.

సూపర్ స్టార్ కృష్ణ గొప్ప మానవతావాది, మంచి మనిషి, మహా మనిషి, దర్శక నిర్మాతల మనిషి బంగారం లాంటి మనిషి మా అభిమాన హీరో సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ఆయనకు ఘనమైన నివాళులు అర్పించి హీరో కృష్ణ గారి అభిమానులగా పుట్టడం ఎంతో ఆనందించదగ్గ విషయం అని అన్నారు అలాంటి కృష్ణ గారు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం అని అన్నారు.

## ఉపాధి హామీ కూలీలను ఆదుకోవాలి.. సీఐటీయూ



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని కోరుతూ ఈరోజు నక్కపల్లి మండలంలో దోనివాని లక్ష్మీ పురం గ్రామంలో ఉపాధి కూలీలతో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా సమావేశంలో ఎం.అప్పలరాజు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా చట్టంలో ఉన్న సదుపాయాలు తగ్గించేసి ఇష్టానుసారం వ్యవహరి స్తున్నది గత బడ్జెట్ లో లక్ష కోట్లు కేటాయించారు, ప్రస్తుతం కూలీల సంఖ్య పెరిగింది పని డిమాండ్ పెరిగింది,కూలీ పెంచాల్సి ఉంది అలాంటి ది ఈసంవత్సరం కేంద్ర బడ్జెట్ లో 30 వేలు కోట్లు తగ్గించి, కేవలం 70 వేలు కోట్లు మాత్రమే కేటాయించి, కూలీల నోటి కాడ కూడు కొట్టారని దీన్ని కూలీలందరూ వ్యతిరేకించాలని కోరారు, ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో రెండు లక్షల కోట్లు నిధులు పెంచాలని, సంవత్సరానికి 200 రోజులు పని, రోజు వేతనం 600 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా 30% వేసవి అలవెన్స్, మంచి నీరు కు, పార, గుణపంలకు,తట్టలకు డబ్బులు, నీడకు టెంట్లు, మెడికల్ కిట్లు, మజ్జిగ పంపిణీ చేయడానికి నిధులు లేవని పేదలకు అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశాన్ని దోసుకుంటున్న కార్పోరేట్లకు 11 లక్షల 50 వేల కోట్లు ఋణాలు ఎలా మాఫీ చేస్తారని ప్రశ్నించారు,పాత పద్ధతిలో పనులు నిర్వహించాలని పే స్లిప్ లు ఇచ్చి ప్రతివారం పేమెంట్లు ఇవ్వాలని ఈ డిమాండ్లను నెరవేర్చే విధంగా ప్రభుత్వం పై పోరాటానికి సిద్ధం కావాలని ఉపాధి కూలీలు కు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు భరణికల రాము, జిల్లా కమిటీ సీఐటీయూ సభ్యులు ఎం.నానాజీ , రైతు సంఘం మండల అధ్యక్షులు గింజాల శివాజీ,మరిణియ్య, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లిలో ఘనంగా ప్రారంభమైన సన్ కేస్టిల్ హెూటల్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణం లోని రింగ్ రోడ్ లో నూతనంగా నిర్మించిన సన్ కేస్టిల్ త్రీ స్టార్ హెూటల్ ను పెందుర్తి శాసనసభ్యులు అదీప్ రాజ్, అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బి వి సత్యవతి విష్ణుమూర్తి దంపతులు బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యవతి మాట్లాడుతూ అనకాపల్లి వాసులకు అధునాతన సౌకర్యాలతో కలిగి ఉన్న హెూటల్‌ను అందుబాటులోకి తీసుకు రావడం చాలా సంతోషకరమైన విషయం అని ఈ హెూటల్ ప్రజల మన్ననలను పొందుతూ దినదినాభివృద్ధి చెందాలని అన్నారు. హెూటల్ యజమాని మల్ల రమణ మాట్లాడుతూ జిల్లా కేంద్రం అయిన అనకాపల్లిలో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ హెూటల్ నిర్మించామన్నారు. అధునాతనంగా శ్రీనివాస ఫంక్షన్ హాల్, అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండే విధంగా ఫ్యామిలీ రెస్టారెంట్, లగ్జరీ రూమ్స్ ఏర్పాటు చేసామన్నారు. పట్టణ ప్రజలు తమ వ్యాపార అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్న ఈ స్టార్ హెూటల్ ను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో స్థానికులు తరలివచ్చారు.

# ఏపీ అంటే ఇదా? 448 ఇళ్లు ఉన్న ఆ ఊళ్లో 252 మందికి ఫించన్లు



ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి? అన్న భావన తాజా ఉదంతం గురించి తెలిసినంతనే మనసు కు కలగటం ఖాయం. సంక్షేమ పథకాల అమలు ప్రభుత్వాని కి అధిక ప్రాధాన్యత ఇవ్వటం తప్పు కాదు. అయితే.. ప్రజలు చెల్లించే పన్నుల్ని ఖర్చు పెట్టే వేళలో.. పైసా పైసా జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఉంది. రాష్ట్రాల బడ్జెట్లు లక్షల కోట్ల రూపాయిలుగా మారిపోవటం.. అందు లోని సింహ భాగం సంక్షేమ పథకాల కు ఖర్చు చేస్తున్నప్పటికీ.. ఆర్థిక అసమానతల్లో తేడా రాకపోవటం.. రోజులు గడిచే కొద్దీ సంక్షేమం పేరుతో పెట్టే ఖర్చు అంతకంతకూ ఎక్కువ అవుతున్నదే తప్పించి తగ్గని పరిస్థితి. ఇది దేనికి నిదర్శనం? అన్నది ప్రశ్న.

రోజులు గడిచే కొద్దీ.. ప్రజల ఆర్థిక శక్తి పెరగటంలోనే కదా ప్రభుత్వ విజయం ఉంటుంది. అందుకు భిన్నంగా పరిస్థితులు ఉంటే ఏమనాలి? ఎలా చూడాలి? అన్నదిప్పుడు ప్రశ్న. ఇదే విషయాన్ని తాజాగా జరిగిన ఒక రివ్యూలో ఆసక్తికర విషయం బయటకు వచ్చింది. గుంటూరు జిల్లా చింతపూడి గ్రామంలో 1650 మంది జనాభా ఉంది. అయితే.. ఇళ్ల విషయానికి వస్తే 448 ఇళ్లు ఉన్నాయి. అంటే.. ఇంటి కి సుమారుగా మూడున్నర మంది ఉన్నట్లుగా లెక్కలు చెబుతాయి.

అలాంటి ఊళ్లో నెల నెలా ఎంతమందికి ఫించ న్లు అందుతున్నాయి? అన్నది చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ప్రభు త్వ లెక్కల ప్రకారం 252 మందికి నెల వారీగా పింఛన్ల ను ఇస్తున్న విషయాన్ని కేంద్ర పంచాయితీ రాజ్ శాఖ అదనపు కార్యదర్శి చంద్రశేఖర్ కుమార్ పాల్గొన్న రివ్యూలో బయట కు వచ్చింది. దీంతో ఆయన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. అయితే.. ఆయన ఆశ్చర్యాన్ని అధికారులు మరోలా అర్థం చేసుకోవటం విశేషం.

ఎందుకంటే.. 448 మంది ఇళ్లల్లో ని 252 మందికి నెలవారీ గా పింఛన్లు ఇవ్వటం అంటే.. సగం కంటే ఎక్కువ ఇళ్లు పింఛన్ల పథకం ద్వారా లబ్ధి పొందుతున్నట్లే. గుంటూరు జిల్లా లాంటి ధనిక జిల్లాలో ఇంతటి ఇబ్బందికర పరిస్థితి ఉందా? అన్నది ఒక ప్రశ్న అయితే.. గ్రామంలో ఉన్న ఇళ్లల్లో సగాని కి పైగా నెలవారీ పింఛన్ల లబ్ధిదారులు ఉండటం విస్మయానికి గురి చేయక మానదు.

అంటే.. ప్రతి రెండు ఇళ్లల్లో ఒకటిన్నర మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నట్లుగా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నిజానికి వీరిలో అర్హత ఎంతమందికి ఉందన్న విషయాన్ని అకస్మిక తనిఖీ రూపంలో చేపడితే.. విలువైన ప్రజా ధనం పక్కదారి పట్టకుండా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# చెలామణిలో ఉన్న కరెన్సీ నోట్ల లెక్కలు చెప్పిన ఆర్‌బీఐ

డిజిటల్ ఇండియా అంటూ గతంతో పోలిస్తే సామాన్యుడి జీవితంలో చాలానే తేడా వచ్చేసింది. టీ బంకు వాడి దగ్గర నుంచి ఆటో వరకు.. ఆ మాటకు వస్తే.. సామాన్లు కొనే దగ్గర.. ఇలా ఒకచోట కాదు.. ప్రతి చోటా చెల్లింపులు కరెన్సీ నోట్ల తో కంటే కూడా ఫోన్ ద్వారా డిజిటల్ పేలు ఎక్కువగా జరుగుతున్న పరిస్థితి.




చివర కు భిక్షాటన చేసే వారు సైతం క్యూఆర్ కోడ్లు చూపించి దానం చేయమంటున్న వైనం తెలిసిందే. ఇలాంటి వేళ.. మార్కెట్లో కరెన్సీ నోట్ల వినియోగం తక్కువగా ఉండాలి కదా? కానీ.. అందుకు భిన్నంగా కరెన్సీ నోట్ల లెక్కలు ఆశ్చర్యానికి గురి చేసేలా ఆర్ బీఐ తాజాగా విడుదల చేసిన రిపోర్టు చెబుతోంది.

ఆర్ బీఐ తాజాగా విడుదల చేసిన వార్షిక నివేదికలో కరెన్సీ నోట్ల వినియోగం లెక్కలు ఆసక్తికరంగా మారాయి. 2023 నాటికి చలామణిలో ఉన్న బ్యాంకు నోట్ల విలువ.. పరిణామం పెరగటం గమనార్హం. ఊరట కలిగించే ఒకే ఒక్క అంశం ఏమంటే.. ఈ పెరుగుదల శాతం తగ్గటం ఒక్కటే. చలామణిలో ఉన్న మొత్తం నోట్ల లో విలువ పరంగా చూస్తే.. రూ.2వేల నోట్లు.. రూ.500నోట్లు వాటా 87.9 శాతం కాగా.. 2022 మార్చి 31 నాటికి 87.1 శాతంగా ఉండేది.

డినామినేషన్ పరంగా చూస్తే.. రూ.500నోట్ల డినామినేషన్ 37.9శాతం వాటా ఉంటే.. తర్వాతి స్థానంలో రూ.10నోటు ఉండటం గమనార్హం. దీని వాటా 19.2 శాతం. 2022 మార్చి చివరి నాటికి రూ.500 నోట్ల సంఖ్య 455468 లక్షలు అయితే.. 2023 మార్చి నాటికి రూ.500 నోట్ల డినామినేసన్ నోట్లు 516338లక్షలుగా పేర్కొన్నారు. అంటే.. వ్యవస్థలో రూ.500 నోట్లు పెరిగినట్లే. ప్రస్తుతం చలామణిలో ఉన్న డినామినేషన్ల విషయానికి వస్తే 2 5 10 20 50 100 200 500 2000 నోట్లు ఉండగా అర్థరూపాయి..రూపాయి.. రెండు రూపాయిలు.. ఐదు రూపాయిలు.. 20 రూపాయిలు డినామినేషన్ తో నాణాలు ఉన్నట్లుగా రిపోర్టు వెల్లడించింది.

2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంకు నోట్ల ఇండెంట్.. సరఫరాలు రెండూ గత ఏడాది 2021-22తో పోలిస్తే 1.6శాతం పెరిగాయి. రూ.2వేల నోట్ల ప్రింటింగ్ కు ఇండెంట్ లేదన్న విషయం తెలిసిందే. రూ.2వేల నోట్ల కు సంబంధించి ఆర్ బీఐ తాజాగా పేర్కొన్న లెక్కల్ని చూస్తే.. 2023 మార్చి చివరకు రూ.362220 కోటల విలువ చూసే 455468 లక్షల నోట్లు చెల్లుబాటులో ఉన్నాయి. 2022 మార్చి చివరి నాటి కి చెలామణిలో ఉన్న మొత్తం కరెన్సీలో 1.6 శాతం ఉంటే 2022-23 మార్చి చివరి నాటికి 1.3 శాతానికి తగ్గినట్లుగా ఆర్ బీఐ పేర్కొంది.

# నాడూ-నేడు పనులను త్వరగా పూర్తి చేయాలి

**విజయనగరం:** నాడూ-నేడు పనులను త్వరగా పూర్తి చేసి, పాఠశాలలను పునఃప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఆమె బుధవారం గుర్ల, చీపురుపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, సచివాలయాలను తనిఖీ చేశారు. ట్రైనీ కలెక్టర్ సహాదిత్ వెంకట త్రివినాగ్, చీపురుపల్లి ఆర్‌డిఓ అప్పారావు, ఇతర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

**గుర్ల మండలంలో..**

కెల్ల గ్రామం మెంటు చెరువులో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులను కలెక్టర్ పరిశీలించారు. ఉపాధి సిబ్బందితో, మేట్లతో మాట్లాడారు. హాజరైన వేతనదారులు, మస్తర్లు, సగటు వేతనం, పంచాయితీ రిజిస్టర్, వర్కు ఎస్టిమేట్ తదితర అంశాలను పరిశీలించారు. రెండుపూటలా పనిచేయలేకపోతున్నామని వేతనదారులు చెప్పగా, వేతనం ఎక్కువ రావాలంటే, రెండుపూటలా పనిచేయాల్సి ఉంటుందని అన్నారు. హౌసింగ్ బిల్లులు పడలేదని, జగనన్న కాలనీలో పట్టాలు ఇవ్వలేదని స్థానికులు చెప్పిన సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

కెల్ల జిల్లాపరిషత్ హైస్కూలులో జరుగుతున్న నాడూ-నేడు పనులను కలెక్టర్ పరిశీలించారు. టాయిలెట్ల నిర్మాణం, కిచెన్ షెడ్‌ను తనిఖీ చేశారు. పనులు వేగంగా నిర్వహించి, పాఠశాలల పునఃప్రారంభం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పదోతరగతి ఫెయిలైన విద్యార్థులకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదివి, సప్లిమెంటరీ పరీక్షల్లోనైనా ఉత్తీర్ణులు కావాలని కోరారు. వచ్చే విద్యాసంవత్సరంలో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని, పది పాసైన విద్యార్థులంతా ఉన్నత తరగతుల్లో శతశాతం చేర్పించాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు.

రీసర్వే త్వరగా పూర్తి చేయాలని సర్వే, రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గుర్ల గ్రామ సరిహద్దుల్లో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను పరిశీలించారు. గ్రౌండ్ ట్రూతింగ్, డ్రోన్ ఫ్లై, ప్రభుత్వ భూముల నమోదుపై ఆరా తీశారు. రోజుకు సుమారు 20 ఎకరాలకు తక్కువ కాకుండా సర్వే చేయాలని, ఉదయం సర్వే జరిపి, మధ్యాహ్నం నుంచి రికార్డు వర్కు పూర్తి చేయాలని సూచించారు.

గూడెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీని కలెక్టర్ సందర్శించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను, పూర్తి చేసిన ఇళ్లను పరిశీలించారు. లబ్దిదారులతో, స్థానిక నాయకులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బిల్లుల చెల్లింపుపై ఆరా తీశారు. అన్ని ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని కోరారు.

చోడవరం గ్రామంలోని సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగనన్న గృహనిర్మాణం, ఇకెవైసి నమోదు, విత్తన సంసిద్ధత, నాడూ-నేడు, ఆరోగ్య తనిఖీలు, పోషకాహార పంపిణీ, ఫ్యామిలీ డాక్టర్ తదితర కార్యక్రమాలపై సిబ్బందిని ప్రశ్నించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురించి ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలద్వారా అందరికీ ముందే సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాలకు వెళ్లిన ప్రతిసారీ, బిపి, షుగర్ పేషెంట్లు, ఇతర దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలందరికీ వైద్య పరీక్షలను నిర్వహించి, అవసరమైన మందులను ఇచ్చేలా చూడాలని సూచించారు. పదోతరగతి ఉత్తీర్ణులైన వారందరూ తప్పనిసరిగా ఉన్నత తరగతుల్లో చేరాలని, వలంటీర్లు కూడా దీనికి బాధ్యత వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

గుర్ల మండల పర్యటనలో డిఎల్‌డిఓ లక్ష్మణ్, ఎంపిడిఓ కళ్యాణి, తాశిల్దార్ సూర్య, ఎపిఓ హరనాథ్, ఎంఈఓ భానుప్రకాష్, హౌసింగ్ డిఇ శంకర్రావు, ఏఈ శ్రీనివాసరావు, డిఐఓఎస్ పి.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ శివ, పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, ఇతర మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

**చీపురుపల్లిలో....**

ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. చీపురుపల్లి పట్టణ పరిధిలోని ఆంజేయపురంలో నిర్మాణంలో ఉన్న 4వ నెంబరు సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఎన్నిరోజుల్లోగా భవనం పూర్తి చేస్తారని సిబ్బందిని ప్రశ్నించారు. ఆర్‌బికె, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణంపై ఆరా తీశారు.

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రెడ్డిపేటలో సుమారు రూ.2లక్షల వ్యయంతో మంజూరు చేసిన సిమ్మెంటు డ్రెయిను నిర్మాణాన్ని పరిశీలించారు. 120 మీటర్లకు గాను, ఇప్పటివరకు 70 మీటర్ల మేర నిర్మాణం పూర్తయ్యిందని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తెలిపారు. త్వరగా పనులు పూర్తి చేయాలని, పని పూర్తయిన నాలుగు రోజుల్లోనే బిల్లులు జమ అవుతాయని కలెక్టర్ తెలిపారు.



పాఠశాల మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని విద్యాశాఖ, వెలుగు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విజయరాంపురం మండల పరిషత్ పాఠశాలలో చేపట్టిన నాడూ-నేడు పనులను ఆమె పరిశీలించారు. కిచెన్ షెడ్, టాయిలెట్ల నిర్మాణాన్ని పాఠశాలల పునఃప్రారంభం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పెచ్చులూడిపోయిన సీలింగ్‌కు మరమ్మతులు చేయాలని సూచించారు.

విద్యాకానుక పంపిణీకి ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖాధికారులను, ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. చీపురుపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలను సందర్శించారు. సుమారు రూ.95లక్షలతో కిచెన్‌షెడ్, మరుగుదొడ్లను నిర్మించడానికి ప్రతిపాదించామని అధికారులు వివరించారు. అక్కడే ఏర్పాటు చేసిన మండల స్థాయి స్టాక్ పాయింట్లో భద్రపరిచిన విద్యాకానుక కిట్లను, పుస్తకాలను, ఇతర సామగ్రిని కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలల వారీగా కిట్లను సిద్ధం చేసి ఉంచితే, పంపిణీ సులువుగా పూర్తి అవుతుందని సూచించారు.

సమగ్ర భూసర్వే ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సర్వేను పూర్తి చేయడంతోపాటు, అదే సమయంలో దానికి సంబంధించిన రికార్డు పనులను కూడా తప్పులు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. చీపురుపల్లి తాశిల్దార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. రీసర్వే వెక్టరైజేషన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు.

చీపురుపల్లి మండల పర్యటనలో డిప్యూటీ సిఈఓ, మండల ప్రత్యేకాధికారి కె.రాజ్‌కుమార్, తాశిల్దార్ ఎం.సురేష్, ఎంపిడిఓ కె.రామకృష్ణరాజు, ఎంఈఓ ఎస్.భానుప్రకాష్, ఇతర మండల స్థాయి అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి యనమలను కలిసిన బుడుమూరి



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు, రాష్ట్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ని బుధవారం విశాఖ టిడిపి పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు, 9వ వార్డు టిడిపి ఇన్చార్జ్ బుడుమూరి గోవింద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ బుడుమూరి గోవింద్ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, ప్రజలకు చేస్తున్న సేవలను అభినందిస్తు, మెచ్చుకున్నారు. రానున్న ఎన్నికలకు అహర్నిశలు కష్టపడి తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పేర్కొన్నారు.

## బీజేపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్ ని కలసిన గాజువాక నాయకులు కేఎన్ఆర్



**గాజువాక, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం లాసెన్స్ బే కాలనీ బిజెపి కార్యాలయంలో జాతీయ కార్యదర్శి సత్య కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు.అనంతరం పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ 9 ఏళ్ల సేవా సుపరిపాల పేదల సంక్షేమం పై నెలరోజలపాటు చేయనున్న కార్యక్రమాలపై కార్యాచరణ,పలు సూచనలు చేశారు.గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం నుండి కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు,ఉక్కునగరం మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు ,జిల్లా ఉపాధ్యక్షురాలు వర్రి.లలిత తదితరులు శాలువాతో సత్కరించి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో చేపట్టిన కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి ,మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పివిఎన్ మాధవ్, జిల్లా ఇన్‌ఛార్జ్ పుట్టా గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి విగ్రహ పునః ప్రతిష్ట



**దేవరాపల్లి, (విశాఖ సమాచారమ్):** మండలంలోని మారేపల్లి గ్రామం శారదా నది ఒడ్డున, పాండవుల మెట్ట (దేముని కొండ)పై వెలసిన శ్రీశ్రీశ్రీ శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి విగ్రహ పునః ప్రతిష్ట మహెూత్సవ కార్యక్రమంలో సతీ సమేతంగా పాల్గొన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల మాజీ ఎంపీపీ భాస్కర రావు, మాడుగుల ఎంపిపి పెద బాబు, బూరె బాబురావు, పలువురు నాయకులు ఉన్నారు.

## పొగాకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అనకాపల్లి పట్టణంలో బుధవారం భారీ ర్యాలీ జరిగింది. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పొగాకు వ్యతిరేక దినోత్సవం కార్య క్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూపొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని అన్నారు. పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు బారినపడి జీవితాలను పాడు చేసుకోవద్దు అన్నారు. ఓమి బాబా క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు సిబ్బంది నర్సులు ఏఎన్ఎంలు పాల్గొన్న అవగాహన ర్యాలీని కలెక్టర్ రవి పటాన్ శెట్టి జండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో ప్రదర్శకులు పెద్ద ఎత్తున పొగాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీ అనకాపల్లి మెయిన్ రోడ్డు, నెహ్రూ చౌక్ మీద సాగింది. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి స్మరణ్ రాజ్ వైద్యాధికారి హేమంత్, డిఆర్ఓ వెంకటరమణ, జెడ్ సి వెంకటరమణవైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జూలై 27న చలో పార్లమెంటు

### ఆల్ ఇండియా పోస్టల్ విశ్రాంత ఉద్యోగుల సంతకాల సేకరణ



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** ఎన్ సీ సీ పీఏ,ఆల్ ఇండియా పోస్టల్,ఆర్.ఏం.ఎస్ పెన్షనర్ల అసోసియేషన్ పిలుపు ననుసరించి నిరసనలో భాగముగా బుధవారం సంతకాల సేకరణ జరిగింది.కాకినాడ ప్రధాన తపాలా కార్యాలయం వద్ద పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సిఫార్సులు 18నెలల డియర్ నేస్ రిలీఫ్ బకాయిలు,ఆరో వేతన సంఘం సిఫార్సులు 2006జనవరి1నుండి అమలు చేయాలని, ఎల్జీఓలకు ప్రమోషన్స్ అమలు,డిసెంబర్ జూన్ నెలలో రిటైర్ అయిన వారికి ఒక ఇంక్రిమెంట్ సుప్రీంకోర్టు ఆర్డర్స్ అమలు రైల్వేలో ప్రయాణిస్తున్న 60 సంవత్సరములు వారికి రాయితీ పునరుద్ధరణ తదితర కోర్కెల సాధనకు ఈ సంతకాల సేకరణ చేసి జూలై 21న జరిగే చలో పార్లమెంట్ నాడు ప్రధాని మోడీకి అంద చేస్తామని అల్ ఇండియా పోస్టల్ ,ఆర్.ఏం.ఎస డివిజనల్ కార్యదర్శి తురగా సూర్యారావు తెలిపారు. ఆల్ సెంట్రల్ గవర్నమెంట్ రిటైర్డు పెన్షనర్స్ జనరల్ కార్యదర్శి ఎస్.వి.ఎన్

సాయిరాం.మాట్లాడుతూ జూలై 21 చలో పార్లమెంట్ దిగ్విజయం చేయాలని పిలుపు నిచ్చారు. ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ గ్రూప్ సి డివిజనల్ కార్యదర్శి పి.సాగర్ పి4,కార్యదర్శి కె.శ్రీనివాసరావు మద్దతు తెలిపినారు.ఈ కార్యక్రమములో జాయింట్ కార్యదర్శి వి.సుభద్ర,ఉదయ కామేశ్వరి, రమణమ్మ వైస్ ప్రెసిడెంట్ జి వి లక్ష్మి నారాయణ, ఫైనాన్స్ కార్యదర్శి రామారావు జాయింట్ కార్యదర్శి ఏం.శ్రీనివాసరావు వి.వీర్రాజు, గణపతి, త్రినాధరావు,రమణయ్య పంతులు, జి.భాస్కరరావు. కే.వి.వి.ఎస్. సూర్య నారాయణ, జి.చాముండేశ్వరి, జి.సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

## వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి ఊరేగింపు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక గవరపాలెం నిదానం దొడ్డిలో కొలువైన శ్రీ కామాక్షి దేవి ఆలయంలో గురువారం శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా బుధవారం సుబ్రమణ్య స్వామి విగ్రహాన్ని పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. విగ్రహ దాతలు పొన్నాడ సుందరయ్య (చిట్టి). కుమారులు వెంకట సత్య నర్సింహచారి, బ్రహ్మజీ సహకారంతో విగ్రహ ప్రతిష్ట జరుగుతుందన్నారు. బుధవారం ఉదయం స్వామివారికి ఆలయ మండపంలో విగ్నేశ్వర పూజ రక్ష సూత్రధారణ అగ్ని ప్రతిష్ట హోమము నిర్వహించి అనంతరం స్వామివారిని పురవీధుల్లో ఊరేగింపు జరుగు తుందని కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ ఊరేగింపును పార్లమెంట్ పార్టీ పరిశీలకులు దాడి రత్నాకర్ ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి శ్రీదేవి, పట్టణం విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కోటిపల్లి జేజిబాబు, ప్రధాన కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు ,కోశాధికారి పొన్నాడ వెంకట సత్య నరసింహచారి(పెదబాబు) , పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ అవినాష్ రెడ్డి కేసు అంతులేని కథ: గోరంట్ల



**రాజమహేంద్రవరం:** ఏపీ సీఎం వైఎస్ జగన్ అరాచకాలకు రాష్ట్ర ప్రజలు సెలవు చెప్పాలని చూస్తున్నారని తెలుగుదేశం నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మహానాడును విజయవంతం చేసిన తెదేపా కార్యకర్తలు, అభిమానులకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆతిథ్యం ఇవ్వడంలో తెలుగుదేశాన్ని మించింది లేదన్నారు. తెదేపా తొలి విడత మేనిఫెస్టోని ప్రజలు ఆదరిస్తారని.. దసరాకి పూర్తి స్థాయి మేనిఫెస్టో వస్తుందని చెప్పారు.

"మహానాడు బ్యానర్లు కట్టుకుంటే మధ్యలో ఎంపీ భరత్ దూరి వైకాపా ఫ్లెక్సీలు కడుతున్నారు. తిరిగి మా మీదే కేసులు పెడుతున్నారు. రాజమహేంద్రవరంలో అధికారులతో కలిసి ఎంపీ ఆటలాడుకుంటున్నారు. సవాల్ విసురుతున్నా.. పోలీసులు చుట్టూ లేకుండా వైకాపా నేతలు ఎవరైనా బయటకు రాగలరా?" అని ఆయన ప్రశ్నించారు.

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసుపైనా ఆయన స్పందిస్తూ.. సీఎం జగన్ దిల్లీ వెళ్లినప్పుడల్లా అవినాష్ కేసు విషయం బ్రేకులు పడుతూనే ఉందన్నారు. హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తారా? అని ఆయన నిలదీశారు. అవినాష్ రెడ్డి కేసు అంతులేని కథ అని గోరంట్ల వ్యాఖ్యానించారు.

# పాఠశాలలు ప్రారంభం అయ్యేలోగా నాడు నేడు పనులు పూర్తి కావాలి



విజయనగరం: పాఠశాలలు ప్రారంభం అయ్యేలోగా నాడు నేడు పనులు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. టాయిలెట్స్, కిచెన్ షేడ్స్, మేజర్ మైనర్ రేపైర్స్ పనులన్నీ వచ్చే పది రోజుల్లో వేగంగా జరగాలని, పిల్లలు వచ్చే నాటికి పనులన్నీ పూర్తి చేయాలనీ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియం లో ఎం.ఈ.ఓ లు, డి.ఈ లు, ఎ.ఈ లతో నాడు నేడు పనుల పురోగతి పై కలెక్టర్ మండల వారీగా సమీక్షించారు. లేబర్ , సిమెంట్ లేని చోట పక్క మండలాల నుండి సర్దుబాటు చేసుకోవాలని, పనులు ఎట్టి పరిస్థితుల్లో ఆగకూడదని అన్నారు. పనులన్నీ పేరెంట్స్ కమిటీ లతోనే జరగాలని స్పష్టం చేసారు. గత సమీక్ష 15 రోజుల క్రితం జరిగిందని, ఈ 15 రోజుల్లో కొన్ని మండలాల్లో ఎలాంటి పురోగతి కనపడ లేదని, ఇలాగె ఉంటె చర్యలు తప్పవని అన్నారు. సిబ్బంది లేరని, సిమెంట్ లేదని కథలు చెప్పొద్దని, సచివాలయ ఇంజనీరింగ్ సహాయకుల తో పనులు చేయించాలని అన్నారు. పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లులను వెంట వెంటనే అప్లోడ్ చేయాలనీ అన్నారు. ఎం.ఈ.ఓ లు ఈ పది రోజుల్లో వారి పరిధి లోనున్న అన్ని పాఠశాలలను సందర్శించి పనుల తీరు పై దృష్టి పెట్టాలని అన్నారు. వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని పనులు వేగంగా జరిగేల చూడాలని సూచించారు.

పాఠశాలల ప్రారంభం తర్వాత విద్యార్థుల నమోదు, రోజు వారీ హాజరు పరిశీలిస్తానని , విద్యార్థుల హాజరు ఖచితంగా ఉండాలని అన్నారు. అదే విధంగా డ్రాప్ ఔట్ల వివరాలను కూడా దగ్గర పెట్టుకోవాలని , రెగ్యులర్ గా బడికి పిల్లలు వచ్చేలా చూసే బాధ్యత టీచర్ల దేనని అన్నారు. మధ్యాహ్న భోజనం క్వాలిటీ , మెనూ తప్పనిసరిగా పాటించాలని, తనిఖీల్లో నేను కూడా భోజనం చేస్తానని అన్నారు. తాగు నీరు, టాయిలెట్స్ అన్ని స్కూల్స్ లో ఉండాలని అన్నారు. సబ్జెక్టు టీచర్స్ విద్యార్థులకు బోధించేతప్పుడు వారికి ఆసక్తి కలిగేల బోధించాలని, ఏ తరగతి లోనైనా ఏ విద్యర్థినైన రాండమ్ గా చదివిస్తానని, విద్యార్థులు చదవలేక పోయిన, ప్రశ్నలు చెప్ప లేకపోయినా సంబంధిత ఉపాధ్యాయులే బాధ్యత వహించాలని అన్నారు. 10 వ తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత చెందేలా మొదటి రోజు నుండే ప్రణాళికా బద్ధం గా బోధించాలని అన్నారు. వచ్చే ఏడాది ఫలితాలు మెరుగుపడాలని అన్నారు. ఈ సమావేశం లో సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్ , డి.ఈ.ఓ లింగేశ్వర రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ వస్తే చేనేతపై 5 శాతం జీఎస్టీ ఎత్తివేస్తాం: లోకేశ్



వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర కొనసాగుతోంది. దేవగుడి క్యాంప్ సైట్ వద్ద చేనేత కార్మికులతో లోకేశ్ ముఖాముఖి సమావేశమయ్యారు. టెక్స్ టైల్ పార్కులో ఉపాధి అవకాశాలు కరవయ్యాయని, అన్ సీజన్ లో ప్రభుత్వం నుంచి సహకారం అందడంలేదని చేనేత కార్మికులు లోకేశ్ ఎదుట వాపోయారు.

ఈ సందర్భంగా లోకేశ్ స్పందిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా చేనేతను దత్తత తీసుకుంటామని ప్రకటించారు. టీడీపీ వచ్చాక చేనేతపై 5 శాతం జీఎస్టీ ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు. నేత కార్మికులకు టిడ్కో ఇళ్లు, వర్కింగ్ షెడ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మగ్గం ఉన్న కార్మికులకు 200 యూనిట్ల విద్యుత్ ఇస్తామని లోకేశ్ వెల్లడించారు. చంద్రన్న బీమా పథకాన్ని మళ్లీ ప్రవేశపెడతామని చెప్పారు.

## పొగాకు వినియోగం తగ్గించండి కుటుంబానికి రక్షణగా నిలవండి

### డాక్టర్ డిడి నాయుడు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ డి డి నాయుడు అనకాపల్లి లో రాలీ నిర్వహించారు.ధూమపానం ఆరోగ్యానికి హానికరం గుండె,ఊపిరితిత్తులకు శత్రువు పొగాకు వినియోగం తగ్గించండి కుటుంబానికి రక్షణ గా నిలవండి అంటూ ర్యాలీలో వైద్య సిబ్బంది నినాదాలు చేశారు .గుండెకు రక్తం సరఫరా.చేసే నాళాలు దెబ్బతింటాయని,గుట్కా పొగాకు జరదా నమలడం వలన గొంతు ఊపిరితిత్తులు ,కాలేయ సంబంధ వ్యాధులు ప్రబలతాయని పొగాకు లో ఉన్న బెంజిన్ ,అర్సినిక్,క్రోమియం ,ఇతిలిన్ ఆక్సైడ్ వంటి ప్రమాద కరమైన రసాయనాలు వలన 72 రకాల క్యాన్సర్ కారకాలు ఉంటాయని డాక్టర్ నాయుడు అన్నారు.రక్త నాళాలు గడ్డ కట్టడం వలన మెదడు కు రక్తం సరఫరా కొన్ని సమయాలలో పక్షవాతానికి కూడా గురి కావచ్చని మహిళలకు దూమ పానం అలవాటు ఉంటే గర్భాశయ కేన్సర్ కి గురి అవుతారని కావున పొగాకు సేవనం అరికట్టాలని హితవు పలికారు . ధూమపానాన్ని నిషేదించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

# నాలుగేళ్లలో అన్ని రంగాలలో వెనుకబడిన అనకాపల్లి జిల్లా



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు అవుతున్న అనకాపల్లి జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ అభివృద్ధి శూన్యమని తెలుగుదేశం పార్టీ జిల్లా మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకట్రావు విమర్శించారు మంత్రుల అండదండలతో వైసిపి శ్రేణులు భూ అక్రమాలకు పాల్పడ్డారని,1845 ఫిర్యాదులతో రాష్ట్రంలో రెండవ స్థానంలో అనకాపల్లి జిల్లా ఉందని మొదట స్థానంలో కడప జిల్లా ఉందని, దీన్ని బట్టి రాష్ట్రంలో పరిపాలన పక్కన పెట్టి, అరాచకాలు,భూ అక్రమాలుమైన్, ఇసుక ,గ్రావెల్ వంటి ఖనిజాలు వైసీపీ శ్రేణులు ఎక్కడకక్కడ దోచుకుంటున్నారని ఉన్నారు. ఎన్నికలకు ముందు జగన్ అనకాపల్లి జిల్లాలో పర్యటించినప్పుడు షుగర్ ఫ్యాక్టరీల పరిస్థితిని రైతులు వివరించినప్పుడు ఫ్యాక్టరీలను ఆధునీకరణ చేసి చెరకు రైతులకు మంచి రేటు చెల్లిస్తామని, ఉద్యోగులకు కార్మికులకు భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చి నాలుగు సంవత్సరాలు అవుతున్న నేటికీ షుగర్ ఫ్యాక్టరీ మూతపడి ఉన్నాయని, కనీసం రైతులకు చెల్లించవలసిన బకాయిలు కూడా చెల్లించడం లేదని, కార్మికులకు ఉద్యోగులకు జీతాలు బకాయిలు పడి ఉన్నాయని, దీనిలో వి.వి రమణ సుగర్ ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టారని, తాగునీరు సాగునీరు అందించే ప్రాజెక్టులను నీరుగార్చారని, పోలవరం ఎడమ కాలువ, సృజల స్రవంతి ప్రాజెక్టులకు 136 కోట్ల నిధులు మంజూరు చేసినప్పటికీ నిధులు విడుదల చేయలేకపోవడం వల్ల ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని వెంకటరావు ఎద్దేవా చేశారు. రైతుల ప్రయోజనాలు కాపాడతానని, మా ప్రభుత్వం రైతుల పక్షపాతి ప్రభుత్వం అని చెప్పుకోవడం తప్ప, వారు అవసరాలైన పంటలు పండించుకోవడానికి వంటకాల వలకు నీరు వెళ్లే గ్రోయిన్ మరమ్మతులు నాలుగు సంవత్సరాలు అయినా పట్టించుకోలేదన్నారు. అనకాపల్లి జిల్లాకు ఇద్దరు మంత్రులు ఉన్నా బూడి ముత్యాల నాయుడు మాడుగులకు పరిమితమయ్యారని, రెండో మంత్రి అమర్నాథ్ చంద్రబాబు నాయుడును విమర్శించడానికి సమయం కేటాయిస్తున్నారని, మరోవైపు సొంత ప్రయోజనాలు చూసుకుంటున్నారని వెంకటరావు విమర్శించారు. వైసిపి పాలనలో అన్ని రంగాల్లో అనకాపల్లి జిల్లా వెనుకబడిపోయిందని, నాలుగు సంవత్సరాలుగా ఈ ప్రభుత్వం ప్రజలపై ఇంటి పన్నులు, కరెంటు చార్జీలు, ఆర్టీసీ చార్జీలు, పెట్రోలు డీజిల్ రేట్లు పెంచడం వల్ల నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, సంక్షేమం పేరుతో ప్రజలను దోచుకుంటున్నారని వెంకటరావు వ్యాఖ్యానించారు.

# మోదీ సర్కార్‌కు తొమ్మిదేళ్లు



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** నరేంద్ర మోడీ 9 సంవత్సరాల పాలన లో కోవిడ్ 19 సమయంలో వాక్సిన్ ఉచితంగా 100 దేశాలకు ఉచిత పంపిణీ , కోవిడ్ సమయంలో 80 కోట్ల మంది ప్రజలకు ఉచిత రేషన్, 9.6 కోట్ల గృహాలకు గ్యాస్ కనెక్షన్, 12 కోట్ల గృహాలకు మంచినీటి సౌకర్యం, 11.72 కోట్లతో మరుగుదొడ్లు, 9300 పైగా జన ఔషధ కేంద్రాలు,3.5 కోట్లతో పక్కా గృహాలు, ప్రతి పేదవానికి ఐదు లక్షల రూపాయలు ఆయుష్మాన్ భారత్, జాతీయ భద్రత, ఈశాన్య రాష్ట్రాల అనుసంధానం, వారసత్వం మరియు అభివృద్ధిలో దేశ, రాష్ట్రాల అభివృద్ధి విజయాలను ప్రాజెక్టర్ స్క్రీన్ మీద పత్రిక విలేకరుల సమావేశంలో కొనియాడారు. ఈ కార్యక్రమంలో వేటుకూరి సూర్యనారాయణ రాజు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, ముత్త నవీన్ కృష్ణ , చిలుకూరి రాంకుమార్, పెద్దిరెడ్డి రవికిరణ్, సాలగ్రామ లక్ష్మి ప్రసన్న, విత్తనాల వెంకటరమణ, చెక్క రమేష్, రంబాల వెంకటేశ్వరరావు, వివిధ మోర్చాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఒలింపిక్ క్రీడల్లో పతకం సాధించిన తొలి భారతీయ మహిళ కరణం మల్లేశ్వరి పుట్టిన రోజు (జూన్ 1)



స్త్రీ అబల కాదు సబల అని నిరూపించిన అగ్రశ్రేణి వెయిట్ లిఫ్టర్ కరణం మల్లీశ్వరి. హిరోషిమా లో జరిగిన ఆసియాడ్ లో రజత పతకాన్ని, ప్రపంచ వెయిట్ లిఫ్టింగ్ పోటీలో స్వర్ణ పతకాలను అందుకుని క్రీడా రంగంలో భారత కీర్తి ప్రతిష్టలను విశ్వ వ్యాప్తంగా ఇనుమడింప చేసిన క్రీడాకారిణి మల్లీశ్వరి. చిత్తూరు జిల్లా అరగొండ సమీపంలోని కప్పకిందపల్లే గ్రామంలో 1975 జూన్ 1 న జన్మించారు. తండ్రి ఉద్యోగరీత్యా ఆముదాల వలసలో స్థిరపడ్డారు. మల్లీశ్వరి అక్క నరసమ్మ కు జాతీయ వెయిట్ లిఫ్టింగ్ మాజీ కోచ్ నీలం శెట్టి అప్పన్న శిక్షణ ఇచ్చేవారు. అక్క విజయాలను చూచిన మల్లీశ్వరి కూడా ఈ రంగం పై ఆసక్తి పెంచుకున్నారు. చిన్ననాటి నుండి బరువు లెత్తడం లో సాధన చేశారు. ఇందుకు పోలీస్ శాఖలో పనిచేస్తున్న తండ్రి సహకారం లభించింది. కోచ్ సాయంతో వెయిట్ లిఫ్టింగ్ లో మెళకువలు తెలుసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయి జూనియర్, సీనియర్ పోటీలలో పాల్గొని పలు విజయాలు సాధించారు. 1991-92 లో ఇండోనేషియా, 1992-93 తైవాన్ లో జరిగిన ఆసియన్ ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ లో పాల్గొని రజత, రెండు కాంస్య పథకాలు గెల్చుకున్నారు. భారతదేశం తరఫున ఇస్తాంబుల్ లో జరిగిన వరల్డ్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ లో పాల్గొని రజత పతకం సాధించారు. ఆమె 54 కిలోల శరీర విభాగం లో పాల్గొని స్నాక్ లో 87.5 కిలోల క్లీన్ అండ్ జర్కులో 113.0 కిలోల మొత్తం చైనాకు చెందిన షేంగ్ వాంగ్ కూడా ఎత్తారు. ఇద్దరి మధ్య స్వర్ణ పతకం కొరకు టై ఏర్పడింది. షేన్ వాంగ్ శరీర బరువు, మల్లీశ్వరి శరీర బరువుకు 0-6కిలోల తక్కువ ఉండడంతో ఆమెను విజేతగా నిర్ణయించి స్వర్ణ పతకం ఆమెకు ఇచ్చారు. కానీ తర్వాత బయటపడింది విజయ రహస్యం. షెంగ్ వాంగ్ మాదకద్రవ్యాల సేవించి విజయం పొందినట్లు గా రుజువు కాగా అంతర్జాతీయ ఒలింపిక్స్ రూల్స్ ప్రకారం వరల్డ్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆమె విజయాన్ని రద్దుచేసి మల్లీశ్వరి విజేతగా 1994 డిసెంబర్ 15 న ప్రకటించి స్వర్ణ పతకం బహూకరించారు. ఈ విజయంతో మల్లీశ్వరి మనదేశంలో విశ్వ క్రీడారంగంలో వ్యక్తిగత పోటీలలో స్వర్ణం పతకం గెలిచిన తొలి భారతీయ వ్యక్తిగా నిలిచారు. డబల్ గోల్డ్ అందుకున్నారు. 1995 వరల్డ్ ఛాంపియన్ షిప్ లో తిరిగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. సిడ్నీ లో జరిగిన 2000 ఒలింపిక్ క్రీడలలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలో కాంస్య పతకం సాధించింది. ఆ విధంగా ఒలింపిక్ ఆటలలో పతకం సాధించిన మొదటి భారతీయ మహిళ అయ్యింది. వీరి కృషిని గమనించిన 1994-95 సంవత్సరం నకు రాజీవ్ గాంధీ ఖేల్ రత్న అవార్డు ప్రదానం చేశారు. 1996 లో బిర్లా అవార్డ్ అందుకున్నారు. భారత ప్రభుత్వం అర్జున అవార్డ్ తో 1995 లో గౌరవించింది. రాష్ట్ర ప్రభుత్వం నివేశనా స్థలం ఉచితంగా ఇచ్చింది. హిందూజా సంస్థ ఆమెను దత్తత తీసుకుని ఆర్థిక సహాయం చేసింది. భారత ఆహార సంస్థ ఆమెకు ఉద్యోగ వసతి కల్పించి గౌరవించింది. మల్లీశ్వరి విజయపరంపర వెనుక జాతీయ కోచ్ లియోనిడ్ తరనెంకో ఉన్నారని తెలుస్తోంది. భారత ప్రభుత్వం 1999 సంవత్సరం లో పద్మశ్రీ పురస్కారం అందచేసారు. భారత క్రీడారంగంలో సంచలనం సృష్టించి అంతర్జాతీయ క్రీడల్లో విజేత మల్లీశ్వరి తెలుగు మహిళ కావడం మనందరికీ గర్వకారణం.

డా. జె.వి.ప్రమోద్ కుమార్
పైడిమెట్ట 9490833108.

# పెందుర్తిలో అర్ధరాత్రి రెచ్చిపోయిన రౌడీ మూకలు



**వేపగుంట, (విశాఖ సమాచారమ్):** విశాఖ జిల్లా పెందుర్తిలో రౌడీ మూకలు రెచ్చిపోయాయి. సుమారు 100 మంది రౌడీల సాయంతో మంగళవారం అర్ధరాత్రి స్థలం కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. పెందుర్తి మండల పరిధిలోని సర్వే నంబర్ 164/1 వేపగుంట షిప్ యార్డ్ లేఅవుట్‌లో మంగళవారం అర్ధరాత్రి దాటాక ఒంటిగంట ప్రాంతంలో కొంతమంది కిరాయి రౌడీ మూకలు రేకుల షెడ్డును దౌర్జన్యంగా తొలగించారు. ఆ సమయంలో రేకుల షెడ్డులో మహిళా వాచ్‌మెన్ నిద్రిస్తోంది. తలుపు పగలగొట్టి దౌర్జన్యంగా మహిళా వాచ్‌మెన్‌ను బయటికి తీసుకువెళ్లారు. భయంతో ఆమె స్థల యజమానికి ఫోన్ చేయాలని ప్రయత్నించగా.. రౌడీ మూకలు ఫోన్ లాక్కున్నారు. యజమానికి ఫోన్ చేస్తే చంపేస్తామంటూ ఆమెను బెదిరించారు. దీంతో సమీపంలో ఉన్న మరో వ్యక్తి ద్వారా ఆమె డయల్ 100కి ఫోన్ చేశారు.

సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు రావడం చూసిన రౌడీలు అక్కడి నుంచి పారిపోయారు. అలా పారిపోతుండగా వారిలో ఇద్దరు రౌడీలను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న భూమి యజమాని (న్యాయస్థానంలో పోరాడుతున్న వ్యక్తి) మహేష్ తన స్థలం వద్దకు చేరుకొని మీడియాతో మాట్లాడారు. "కొంతమంది రౌడీ మూకలు అర్ధరాత్రి వచ్చి దౌర్జన్యం చేశారు. మహిళా వాచ్‌మెన్‌ను భయభ్రాంతులకు గురిచేశారు. స్థానికంగా ఉంటున్న అధికార పార్టీ మంత్రి, ఎమ్మెల్యే అనుచరులే ఈవిధంగా దౌర్జన్యం చేశారు. 2010 నుంచి సివిల్ కోర్టులో స్థల వివాదానికి సంబంధించిన కేసు నడుస్తోంది. ఏడాది క్రితం కొంతమంది రౌడీలు వచ్చి ఇలానే దౌర్జన్యం చేశారు. వారిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. సంవత్సరం తర్వాత ఇప్పుడు మరోసారి దాడి చేయడం ఎంతవరకు సమంజసం? తక్షణమే పోలీసులు ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి" అని మహేశ్ కోరారు.

# చినగదిలి లో శ్వాస పీల్చుతున్న షీరిడి సాయి



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 12వ వార్డులో గల చిన గదిలి నార్త్ షిరిడి సాయిబాబా ఆలయంలో కొత్త రోబోటిక్ శిరిడి సాయి బాబా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని కొద్ది రోజులు పాటు బాబా ఆలయంలో ఉంచుటకు ఆరిలోవకు చెందిన రవి చంద్ర అనే ఫైన్ ఆర్ట్ కళాకారుడు రోబోటిక్ పరిజ్ఞానంతో సాక్షాత్తు మనిషి రూపంగా ఉన్న సాయిబాబా విగ్రహాన్ని తయారుచేసి తద్వారా బాబా శ్వాస పీల్చుకోవడం, చేతివేళ్ళ కదలిక, ఎలక్ట్రానిక్స్ ఆడియో మాటలు భక్తులు అందరినీ ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు . ఆరు నెలల క్రితం ఈయన బాబా మాట్లాడే విగ్రహాన్ని తయారుచేసి అందరి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ చిన్నప్పటినుంచి అందరినీ ఆకట్టుకునేటువంటి విగ్రహాలు తయారు చేయాలని కోరిక ఉండేదని ఇప్పుడిప్పుడే నెరవేరుతుందని అన్నారు. విశాఖ ఆర్కే బీచ్ ప్రాంతంలో ఏనుగు విగ్రహం, పాప, బాబు వంటి విగ్రహాలు ఆయన తయారుచేసినవని చెప్పారు. బాబా ఆలయంలో ఉంచిన రోబోటిక్ బాబా ను చూడడానికి భక్తులు తరలివస్తున్నారని వారు చూసి ఆనందించడంతో నాకు ఎంతగానో సంతోషంగా ఉందని రవిచంద్ర అన్నారు.

పది రోజులు పాటు ఈ విగ్రహాన్ని చిన గదిలి సాయిబాబా ఆలయంలో ఉంచి వేరే దేవాలయానికి శాశ్వతంగా తరలిస్తామన్నారు. ఈ బాబా విగ్రహాన్ని తయారు చేయడానికి ఆరు నెలలు తీసుకుందని విదేశీ పరిజ్ఞానం ఉపయోగించి తయారు చేసినట్టు రవిచంద్ర తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 12.30 గంటల వరకు భక్తులు దర్శించుకోవచ్చు అని ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు పేర్కొన్నారు.

# చంద్రబాబుకు వ్యతిరేకంగా ఊరూరా ఫ్లెక్సీలు



**అమరావతి:** ఏపీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఓటమి భయంతో పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రతిపక్ష నేతల గొంతు నొక్కాలని చూస్తున్నారని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబుకు వ్యతిరేకంగా ఊరూరా ఫ్లెక్సీలు కట్టిస్తూ రెచ్చగొడుతున్నారన్నారు. అనేక చోట్ల చంద్రబాబు మీద అసభ్యంగా ఫ్లెక్సీలు పెట్టిన విషయాన్ని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని మండిపడ్డారు. టీడీపీ నాయకులు ఫ్లెక్సీలు కడితే వెంటనే వాటిని తొలగించారని.. అదేమంటే వైసీపీ నేతల ఫ్లెక్సీలకు అనుమతి ఉందని పోలీసులే చెబుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు మాత్రం ఎవరికీ అనుమతి ఇవ్వలేదని అంటున్నారని తెలిపారు. వైసీపీ నాయకులకు కొంతమంది పోలీసులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తమపై దాడులు చేస్తే వారిపై కేసులు ఉండవని.. తాము ప్రశ్నిస్తేనే కేసులు పెడుతున్నారని అన్నారు. ఇటువంటి పోలీసు అధికారులు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు.

అవసరమైతే కోర్టుకు ఈడ్చి న్యాయస్థానంలో కూడా శిక్ష పడేలా చేస్తామన్నారు. వైసీపీ నాయకులు రెచ్చగొడుతున్నా వారి ఫ్లెక్సీలు తొలగించకపోవడం దారుణం కాదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విధంగా వ్యవహరిస్తే ప్రజల తిరుగుబాటు ఎలా ఉంటుందో చూపిస్తామని కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

# నర్సీపట్నం ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆదిరాజ్ సింగ్ రాణా



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా విశాఖ నుండి విడిపోయిన తర్వాత నర్సీపట్నంలో ప్రభుత్వం ఐపీఎస్ అధికారిని నియమించలేదు. అయితే అనకాపల్లి డిఎస్పి నర్సీపట్నం ఇంచార్జిగా ఉండేవారు. కాగా ఇప్పుడు నర్సీపట్నంలో నూతన అసిస్టెంట్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ గా బాధ్యతలు తీసుకున్నారు ఆదిరాజ్ సింగ్ రాణా. ఆయన గతంలో కర్నూల్ జిల్లా ఆదోని లో పనిచేసేవారు. ఇప్పుడు ప్రభుత్వం ఆయన్న నర్సీపట్నంకు బదిలీ పై పంపించడం జరిగింది. ఆయనకు స్థానిక పోలీస్ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పోలీస్ అధికారులు కలుపుకొని అలాగే శాంతిభద్రతలు పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తానని దీనికి అందరూ సహకరించాలి అని ఆయన తెలిపారు.


విలేకరులు కావలెను
విశాఖ సమాచారమ్
తెలుగు దినపత్రికకు దిగువ తెలిపిన ప్రాంతములలో విలేకరులు కావలెను.
పాయకరావుపేట, కోటవురట్ల, అడ్డురోడ్డు, తాళ్లపాలెం, ఎస్.కోట, కొత్తవలస, పెందుర్తి, ఆనందపురం, తగరపువలస, విజయనగరం, శ్రీకాకుళం రూరల్.
సంప్రదించండి : 9393949345, 7013785256

Looking for Builder/Developer.
10 Acres land available for sale Near Ghatkesar, Only for out rate or Half Development half Out rate. 3.5 Cr Per Acre, Inside ORR, Conservative Zone, Clear Title, Suitable for Villas, Suitable for Layout,
Further details contact me 8147212488

Lawsons bay colony New/old flats for sale
NEW
One flat for one floor Premium construction
Each flat 1700 SFT, 3 BHK
All flats facing East.
Car parking lift generator available.
Loan facility available.
Ready to occupy, Very reasonable price.
Lawsons bay colony
Second sales 10:45 SFT, 2 BHK, North facing,
Lift car parking generator available,
5th floor, Contact me for further details.
Kadambari consultancy services
PSR Prabhu,
90 63 80 1556/ 8977901556

FLAT for SALE
MVP colony, 1250/ 1160 SFT
2Flats for sale, 2BHK, 2years old,
Floring granite, cupboards, modular kitchen,car parking,lift, generator available. South/North. facing, UDS 40, For details contact
KADAMBARI consultancy services.
PSR Prabhu,
9063801556, 8977901556 (wats up number)

We undertake construction works of Individual houses, Group houses, Apartments and all types of civil works.If any one required please contact me
Osr sastry
Sri sitarama constructions
Ph:9293169255




గమనిక
విశాఖ సమాచారమ్ తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
సెల్: 8186030813

Star Health and Allied Insurance Co. Ltd.
స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్.
మీకు ఆరోగ్య బీమా ఉందా..?
DO YOU HAVE A HEALTH CARD..?
If not, its Available Here
M.Chandra Mouli
Health Insurance Specialist
8977899939

INDIVIDUAL HOUSE FOR SALE AT MADURAWADA
SOUTH FACING House 6 years old.
255 sqyrds LRS PAID G+1 House with bike and car parking.
150 mtrs from HIGHWAY.
GROUND floor::
2bhk with attached bathrooms
1st floor::
3bhk with attached bathrooms.
NOTE* :: SOUTH WEST ROAD sole HIT kept Ganesh statue.
Cost:: LAKHS Negotiable...
Call:: 8688623665 for more details.

Wanted Independent House
Madhurawada, kommadi, pm palem line lo individual house or villa purchase cheyutaku kavalenu. 200 -250 sq yards lo kavalenu. Budget 2 to 2.5 cr. Compound wall undali Car parking kuda undali. Please confirm me if anybody knows.
7989422831, 9652694110
my contact numbers

WANTED DISTRIBUTERS
Fitearly
A food supplement powder to drink with milk to regain Energy. Purely without sugar and Very Very Tasty.
IQ Up-HG
A food supplement for school and college going GIRLS to Improve Memory power, Growth, balance Harmones and keep ENERGYTIC.
IQ Up-HB
An interesting and tasty food supplement for school and college going boys to improve concentration on study, sports, memory, IQ, fitness and keeps always ENERGYTIC.
These Three products are manufactured by shri Akella Subrahmanya Sharma, M.D., Herbindo pvt.ltd. Hyderabad.
* Marketing and Business promotion Support is offered for Distributors.
Minimum Investment :
Rs. 25,000/- Only
Atractive profits and lagre Sales assured.
Contact : 9393949345
S.V.Rao, Visakhapatnam

క్లాసిఫైడ్స్, ప్రకటనల కొరకు సంప్రదించండి
8186030813

విశాఖ మ్యూజిక్ & డాన్స్ అకాడమి కళాభారతి
40, పిఠాపురం కోలనీ, విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో
నాటకశాల నటసేవా సమాజం విజయనగరం వారి
"సావిత్రి సవాల్" నాటిక
రచన : ద్విభాష్యం రాజేశ్వరావు
దర్శకత్వం : గెద్ద వరప్రసాద్
"ఆఖరి ఉత్తరం" నాటిక
రచన : చెరుకూరి సాంబ శివరావు
దర్శకత్వం : గెద్ద వరప్రసాద్
వేదిక : కళాభారతి A/C ఆడిటోరియం
తేదీ : 02-06-2023 (శుక్రవారం)
సమయం : సాయంత్రం 6:30 కు
అందరూ ఆహ్వానితులే








VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16,Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96660 15921, Paravaada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389, Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8186030813.